# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :187 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 25-09-2024 | పేజీలు:4 వెల: 2.00


## నారాయణపూర్‌లో ఎన్‌కౌంటర్.. ముగ్గురు మావోలు హతం

ఛత్తీస్‌గఢ్, ఛత్తీస్‌గఢ్ నారాయణపూర్ జిల్లాలో సోమవారం భద్రతా సిబ్బంది, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో మహిళా మావోయిస్ట్ సహా ముగ్గురు హతమయ్యారని సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయంత్రం 4 గంటల సమయంలో ఎదురుకాల్పులు జరిగాయి. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర అంతర్రాష్ట్ర సరిహద్దులోని అబుజ్‌మడ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కోసం బలగాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో కాల్పులు జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు.సంఘటనా స్థలం నుంచి ఏకే 47 రైఫిల్‌తో పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను భద్రతా సిబ్బంది స్వాధీనం చేసుకున్నారని.. ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుందని పోలీస్ అధికారి పేర్కొన్నారు. తాజా ఎన్‌కౌంటర్‌తో ఈ ఏడాది ఇప్పటి వరకు ఛత్తీస్‌గఢ్ బస్తర్ ప్రాంతంలో వేర్వేరు ఘటనల్లో 157 మంది మావోయిస్టులు హతమయ్యారని పోలీసులు వివరించారు.

## శ్రీవారి లడ్డూ కల్తీ వ్యవహారం.. తిరుపతిలో స్వామీజీల నిరసన



తిరుపతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంపై స్వామీజీలు నిరసన బాటపట్టారు. ఏపీ, తెలంగాణ సాధు పరిషత్ ఆధ్వర్యంలో తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం ఎదుట స్వామీజీలు ఆందోళనకు దిగారు. లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆలయాల్లో అన్యమతస్థులను ఉద్యోగులుగా నియమించవద్దని డిమాండ్ చేశారు. టీటీడీ మాజీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, అప్పటి ఈవోలు జవహర్ రెడ్డి, ధర్మారెడ్డి తరదితరులపై చర్యలు తీసుకోవాలన్నారు. సేవ్ తిరుమల.. సేవ్ టీటీడీ నినాదాలతో హోరెత్తించారు. వారితో టీటీడీ ఈఓ శ్యామలరావు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా గత పాలకమండలిపై చర్యలు తీసుకోవాలని ఈఓకు వినతిపత్రం సమర్పించారు.


## ప్రజారోగ్యంపై ఈ ప్రభుత్వానికి పట్టింపు లేదు..



రాష్ట్రంలో ప్రస్తుతం వినిపిస్తున్న పేరు వైరల్ ఫీవర్ . ఎవరి నోట విన్నా, ఎవరి ఇంట్లో చూసినా ఇదే పరిస్థితి. చిన్న పిల్లల దగ్గర నుంచి పెద్ద వాళ్ల వారకూ అంతా జ్వరంతో బాధపడుతున్నారు. తీవ్ర జ్వరం, ఒళ్లు నొప్పులు, తల నొప్పితోపాటు జలుబు వంటి లక్షణాలతో ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్ వ్యాప్తంగా దాదాపు అన్ని ఆసుపత్రులూ జ్వరాల బారిన పడిన రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. గత రెండు నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా.. ప్రజారోగ్యం విషయంలో అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పరిస్థితిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాజాగా స్పందించారు.

ప్రజారోగ్యంపై ఈ ప్రభుత్వానికి పట్టింపు లేదని రేవంత్ సర్కార్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎవడి చావు వాడు చస్తాడు మాకేం సంబంధం అన్నట్లుగా ప్రవర్తిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రజారోగ్యంపై ప్రభుత్వానికి పట్టింపు లేదు. ఎవడి చావు వాడు చస్తాడు మాకేం సంబంధం అన్నట్టుగా ఈ కాంగ్రెస్ సర్కార్ ప్రవర్తిస్తున్నది. రోగాలు, నొప్పులు, వ్యాధుల బాధలతో జనం అల్లాడుతున్నా చలనం లేదు%ౌ% చర్యలూ లేవు. విష జ్వరాలు విజృంభించి ప్రజల ఒళ్ళూ ఇళ్లూ గుల్లవుతున్నా పట్టించుకునే నాధుడే లేడు. బస్తీలకు సుస్తీ చేసింది.. పల్లెలు మంచం పట్టినయ్.. అయినా వైద్యారోగ్య శాఖకు చీమకుట్టినట్టు కూడా లేదు. పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారి దోమలు స్వైర విహారం చేస్తున్నా ప్రభుత్వ శాఖలు మొద్దు నిద్ర వీడటం లేదు. ప్రాణాంతక రోగాలు పట్టి పీడిస్తుంటే.. అరికట్టాల్సిన ప్రభుత్వం అడ్రస్ లేదు..!' అంటూ ధ్వజమెత్తారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

## అమెరికా టూర్‌లో జెలెన్‌స్కీతో ప్రధాని మోదీ భేటీ..



న్యూఢిల్లీ: అమెరికా పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ న్యూయార్క్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు వోల్డోమిర్ జెలెన్‌స్కీని కలిశారు. ఆ ఇద్దరూ ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొన్నారు. నెలల రోజుల వ్యవధిలోనే ఆ ఇద్దరూ రెండో సారి భేటీ అయ్యారు. ఆగస్టు 23వ తేదీన ఉక్రెయిన్‌లో మోదీ పర్యటించిన విషయం తెలిసిందే. రష్యాతో జరుగుతున్న యుద్ధాన్ని నిలిపివేసేందుకు తగిన చర్యలు తీసుకోనున్నట్లు ఆ సమయంలో మోదీ హామీ ఇచ్చారు. తాజాగా న్యూయార్క్‌లో జరుగుతున్న సమ్మిట్ ఆఫ్ ద ఫ్యూచర్ మీటింగ్‌లో కలిశారు.

ఇటీవల జరిగిన భేటీ గురించి ఇద్దరూ మాట్లాడుకున్నారు. ద్వైపాక్షిక సంబంధాలపై సంతోషం వ్యక్తం చేసుకున్నారు. ఉక్రెయిన్‌లో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల గురించి కూడా చర్చించుకున్నారు. దౌత్యం, చర్చల ద్వారా శాంతియుత పరిష్కారాన్ని ఆశిస్తున్నట్లు మరోసారి ఉక్రెయిన్ వివాదంపై ప్రధాని మోదీ తెలిపారు. సంక్షోభాన్ని పరిష్కరించేందుకు భారత్ సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు మోదీ చెప్పారు. గడిచిన మూడు నెలల్లో మోదీ, జెలెన్‌స్కీ కలుసుకోవడం ఇది మూడవ సారి.

## చేపల లోడు లారీ బోల్తా.. లైవ్ ఫిష్ కోసం ఎగబడిన జనం



మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా మరిపెడలో చేపల లోడుతో వెళ్తున్న లారీ బోల్తాపడింది. దీంతో జనాలు చేపల కోసం ఎగబడ్డారు. మంగళవారం ఉదయం ఖమ్మం నుంచి వరంగల్ వైపు వెళ్తున్న లారీ మరిపెడ వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. అందులో ఉన్న చేపలు మొత్తం రోడుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. దీంతో బతికున్న చేపల (లైవ్ ఫిష్) కోసం ప్రజలు పోటీపడ్డారు. అందినకాడికి పట్టుకుపోయారు.

## హైదరాబాద్‌లో ఐటీ దాడులు




హైదరాబాద్: హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఐటీ దాడులు నిర్వహిస్తున్నది. మంగళవారం తెల్లవారుజాము నుంచే కూకట్‌పల్లి, బంజారాహిల్స్ చెక్‌పోస్ట్, మాదాపూర్‌లోని ఇళ్లలు, కార్యాలయాల్లో అధికారులు సోదాలు చేస్తున్నారు. ఈ దాడుల్లో పది బృందాలు పాల్గొంటున్నాయి. %కూకట్‌పల్లిలోని రెయిన్‌బో విస్టాస్ ఐ బ్లాక్‌లోని ఫ్లాట్‌లో కిరాయికి ఉంటున్న న్యూస్ చానల్ అధినేత బొల్లా రామకృష్ణ నివాసంలోనూ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. న్యూస్ చానల్‌తోపాటు ఫైనాన్స్, హాస్పిటల్, రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా ఆయన నిర్వహిస్తున్నారు. మొత్తం ఎనిమిది మంది అధికారులు ఆయన అపార్టుమెంటులో సోదాలు చేస్తున్నారు. ఆదాయ లావాదేవీలకు సంబంధించిన ఫైల్స్ పరిశీలిస్తున్నారు.

## ఫస్ట్ టైమ్ 85 వేల మార్క్‌ను దాటిన సెన్సెక్స్.. 26 వేలకు చేరువలో నిఫ్టీ

దేశీయ స్టాక్ మార్కెట్లు మరో ఉన్నత శిఖరానికి చేరుకున్నాయి. సెన్సెక్స్?మొదటిసారి 85,000 మార్కును దాటింది. నిఫ్టీ సరికొత్త జీవనకాల గరిష్ఠాలను తాకింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు వస్తుండడమే ఇందుకు కారణం. మంగళవారం దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలతో ప్రారంభమై, తరువాత క్రమంగా లాభాల్లోకి వెళ్లాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లను భవిష్యత్తులోనూ తగ్గించే అవకాశాలుండటం, ఆసియా మార్కెట్లు ఆశాజనకంగా ట్రేడవడంతో సెన్సెక్స్ మరో మైలురాయి 85 వేలు దాటింది. ఎనర్జీ, బ్యాంకింగ్, వాహన రంగ షేర్ల నుంచి లభించిన మద్దతుకు తోడు గ్లోబల్ మార్కెట్లు లాభాల్లో ముగియడం కలిసొచ్చింది. మంగళవారం ఉదయం 10:05 గంటల సమయానికి బొంబాయి స్టాక్? ఎక్స్ఛేంజి సూచీ సెన్సెక్స్ 80.74 పాయింట్లు పెరిగి 85,009.35 వద్ద, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజి నిఫ్టీ50 సూచీ 29.15 పాయింట్లు వృద్ధి చెంది 25,968.20 వద్ద కొనసాగుతోంది.

గత సెషన్‌లో 84,928.61 దగ్గర క్లోజ్ అయిన సెన్సెక్స్, ఈ రోజు ప్రారంభంలో దాదాపు 67 పాయింట్ల స్వల్ప నష్టంతో 84,860.73 దగ్గర ఓపెన్ అయింది. సోమవారం 25,939 దగ్గర ఆగిన నిఫ్టీ, ఈ రోజు 18 పాయింట్లు తగ్గి 25,921.45 స్థాయి వద్ద ప్రారంభమైంది. ఉదయం 9:30 గంటల సమయంలో సెన్సెక్స్ 59 పాయింట్లు నష్టపోయి 84,853 వద్దకు చేరింది. నిఫ్టీ50 సూచీ 10 పాయింట్లు కుంగి 25,930 వద్ద ట్రేడైంది. ఆ తర్వాత క్రమంగా పుంజుకున్నాయి.

## తెలంగాణలో రౌడీల పాలన నడుస్తున్నది : సునీత మహేందర్ రెడ్డి



..నరసాపూర్‌లో దాడికి పాల్పడ్డ నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

యాదాద్రి భువనగిరి : తెలంగాణలో రౌడీల పాలన నడుస్తున్నది. నిన్న నర్సాపూర్‌లో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఇంటి పైన దాడి చేయడం హేయమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎవరు ప్రశ్నిస్తే వాళ్లను టార్గెట్ చేసి భౌతిక దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఈ దాడులను ప్రోత్సహిస్తున్నాడని ఆరోపించారు. మొన్న పాడి కౌశిక్ రెడ్డి పై దాడి, నిన్న సునీత లక్ష్మారెడ్డి పైన దాడి, ఇవన్నీ సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్లోనే జరుగుతున్నాయన్నారు. తెలంగాణ అంటేనే భయపడి రోజులు తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో శాంతిభద్రతలు పూర్తిగా క్షిణించాయి. మహిళలంటే కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్ రెడ్డికి అసలు గౌరవం లేదన్నారు. దాడులు చేస్తాం, భయపెడతామంటే చూస్తూ ఊరుకోమని, బాధ్యత గల ప్రతిపక్షంగా మిమ్మల్ని అడుగడుగునా నిలదీస్తామని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ఇలాంటి చిల్లర ప్రయత్నాలు మానుకో

## రుణమాఫీ కోసం రోడ్డెక్కిన రైతన్నలు



వరంగల్ : పంట పొలాల్లో పనులు చేసుకోవాల్సిన రైతన్నలు కాంగ్రెస్ పాలనలో రోడ్డెక్కుతున్నారు. నిన్న, మొన్నటి వరకు కరెంట్, సాగు నీటి కోసం అష్టకష్టాలు పడ్డ రైతులు నేడు రుణమాఫీ కోసం ధర్నాలు, రాస్తారోకోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. తాజాగా వరంగల్‌జిల్లా వర్ధన్నపేటలో రుణమాఫీ కాలేదని రైతన్నలు రోడ్డెక్కి ఆందోళన చేశారు. రుణమాఫీ కాలేదని, కొత్త రుణాల మంజూరులో బ్యాంకర్లు అలసత్వం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు ఎస్బీఐ బ్యాంకు ముందు రోడ్డుపై బైఠాయించారు. అన్నదాతల ఆందోళనతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు రైతులను బుజ్జగించే ప్రయత్నం చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## డీఎస్సీ ఫలితాల విడుదల ఎప్పుడు..?



హైదరాబాద్ : డీఎస్సీ ఫలితాల విడుదలలో జరుగుతున్న జాప్యంపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. టీచర్లు అవసరం ఉందని చెప్పి హడావుడిగా పరీక్షలు నిర్వహించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఫలితాల విడుదలలో ఎందుకు జాప్యం చేస్తోందని అడిగారు. ఈ మేరకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ట్వీట్ చేశారు.

డీఎస్సీని మూడు నెలల పాటు వాయిదా వేసి మెగా డీఎస్సీ నిర్వహించాలని అభ్యర్థులు వేడుకున్నా.. టీచర్లు అవసరముందని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ఆఘమేఘాల మీద జులై 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు కంప్యూటర్ బేస్డ్ విధానంలో పరీక్షలను నిర్వహించారు. ఫైనల్ కీ ప్రకటించిన తర్వాత కూడా జనరల్ ర్యాంకింగ్ ప్రకటించడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు ఆర్ఎస్పీ. జనరల్ ర్యాంకింగ్ ఇచ్చి, మెరిట్‌లో ఉన్న అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తే, పిల్లలకు పాఠాలు బోధించే వీలుంటుందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

వారం రోజుల్లో డీఎస్సీ ఫలితాలు విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. అలాగే సెప్టెంబర్ 5వ తేదీ వరకు నియామకాలు చేపడుతామని హామీ ఇచ్చారు. కానీ అమలుకు నోచుకోవడం లేదని ఆర్ఎస్పీ మండిపడ్డారు. రాష్ట్ర ఖజానాలోని సొమ్మును కొడంగల్, ఢిల్లీకి తరలించినట్లు అనిపిస్తుంది. అందుకే జీతాలకు డబ్బుల్లేక, గురుకుల టీచర్లకే ఐదు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు.. ఇక డీఎస్సీ టీచర్లకు ఎక్కడ్నుంచి తీసుకొచ్చి ఇవ్వాలనే ధోరణిలో ప్రభుత్వం ఉన్నట్లు అనిపిస్తుంది. హైడ్రా పేరుతో అందరి దృష్టి మళ్లించి.. వచ్చే ఏడాది నియామక పత్రాలు ఇవ్వాలని కాంగ్రెస్ సర్కార్ కుట్ర చేస్తున్నట్లు అనిపిస్తుందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. అసలు ఈ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి వర్యులు ఎవరు..? ఆయన ఏ ప్రపంచంలో సేదతీరుతున్నారు..? విద్యాశాఖా మంత్రి లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

## ఏడుపాయల వనదుర్గ ఆలయం మూసివేత



మెదక్: ఏడుపాయల వనదుర్గ ఆలయం మరోసారి మూతపడింది. మంజీరా నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు ఆలయాన్ని మూసివేశారు. సింగూరు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో భారీగా వరద పోటెత్తింది. వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉండటంతో అమ్మవారి దర్శనాలను నిలిపివేశారు. దీంతో రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు కొనసాగుతున్నాయి. భారీ వర్షాలతో ఈ నెలలో ఏడు పాయల ఆలయం మూతపడటం ఇది మూడో సారి. %ఈ నెలారంభంలో మెదక్ జిల్లాతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు దంచికొట్టాయి. దీంతో సింగూరు ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో ఆలయం నీటమునిగింది. దీంతో ఎనిమిది రోజులపాటు అధికారులు ఆలయాన్ని మూసివేశిన విషయం తెలిసిందే.

## కర్ణాటక సీఎం సిద్దరామయ్యకు.. హైకోర్టులో ఎదురుదెబ్బ



బెంగుళూరు: కర్నాటక సీఎం సిద్ధరామయ్యకు.. హైకోర్టులో చుక్కెదురైంది. ముడా స్కామ్‌లో సీఎంను విచారించాలని గవర్నర్ థావర్ చాండ్ గెహ్లాట్ చేసిన నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సిద్దరామయ్య కోర్టును ఆశ్రయించారు. జస్టిస్ ఎం నాగప్రసన్న నేతృత్వంలోని బెంచ్ ఈ కేసులో తీర్పును ఇచ్చింది. గవర్నర్ గెహ్లాట్ వ్యక్తిగత నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నదని, ఆయన పూర్తిగా మెదడు పెట్టి ఈ నిర్ణయం తీసుకున్నట్లు జస్టిస్ నాగప్రసన్న తెలిపారు. అందుకే సీఎంను ప్రాసిక్యూట్ చేయాలని గవర్నర్ తీసుకున్న నిర్ణయంలో ఎటువంటి లోపం లేదని హైకోర్టు తెలిపింది. మైసూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలో సుమారు 14 సైట్లను అక్రమ రీతిలో సీఎం సిద్ధరామయ్య భార్యకు అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ కేసులో సీఎం సిద్దును విచారించాలని గవర్న్ గెహ్లాట్ ఆదేశాలు ఇచ్చారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ప్రకారం, భారతీయ నాగరిక సురక్షా సంహితలోని సెక్షన్ 218 ప్రకారం.. సీఎంను విచారించే అవకాశాలు ఉన్నట్లు గవర్నర్ తన ఆదేశాల్లో తెలిపారు. సిద్దరామయ్య తరపున ప్రముఖ న్యాయవాది అభిషేక్ మనూ సింఘ్వీ, ప్రొఫసర్ రవివర్మ కుమార్ వాదించారు. ఇక గవర్నర్ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అడ్వకేట్ జనరల్ శశి కిరణ్ షెట్టి తమ వాదనలు వినిపించారు.

### తమిళనాడులోని 11 ప్రదేశాల్లో ఎన్ఐఏ సోదాలు

చెన్నై: తమిళనాడులోని 11 ప్రదేశాల్లో ఇవాళ ఎన్ఐఏ సోదాలునిర్వహిస్తోంది. ఉగ్రవాదం కుట్ర కేసులో ఆ తనిఖీలు జరుగుతున్నాయి. ఈ విచారణకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడి కావాల్సి ఉన్నది. చెన్నై, పుదుకొట్టై, కన్యాకుమారిల్లో సోదాలు జరుగుతున్నాయి. హిజ్ ఉత్ తహిర్ కేసు విచారణలో భాగంగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నారు. నిషేధిత ఉగ్రవాద సంస్థలకు రిక్రూట్మెంట్ చేస్తున్న నేపథ్యంలో ఎన్ఐఏ ఈ తనిఖీలు చేపట్టింది.

## సంపాదకీయం

**బుధవారం 25-09-2024**

# సంస్కరణలా! ఆకర్షణలా!!

ఓటర్లను సంతృప్తి పర్చడానికి ప్రభుత్వాలు తలకు మించిన ఆర్థిక భారంతో కూడిన పథకాలను అమలు చేయడానికి ప్రయత్నించడం దేశ భవిష్యత్తుకు ప్రతిబంధకమే. ఉదాహరణకు దాదాపు 2.3 మిలియన్ మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఏకీకృత పెన్షన్ పథకాన్ని ప్రకటించడం ఉద్యోగులకు ఒకవైపు గ్యారంటీ కల్పిస్తున్నా మరోవైపు ప్రభుత్వ ఖజానాకు ఆర్థికంగా భరించలేని సమస్యగా తయారైంది. ఉదాహరణకు ఏకీకృత పెన్షన్ పథకం ఖజానాను ఖాళీ చేయించడమే కాకుండా మొదటి సంవత్సరం లోనే రూ. 800 కోట్ల బకాయిలతోపాటు రూ.6250 కోట్లు వెచ్చించవలసి వస్తుంది. కొన్ని రాష్ట్రాల ఎన్నికలను ఎదుర్కోడానికి ఏదో ఒకటి ఆకర్షణీయ పథకాలను కేంద్రం అమలులోకి తీసుకురావలసి వస్తోంది.కొన్ని రోజుల ముందు 45 మంది ఉన్నతాధికారులను దొడ్డిదారిని నియమించుకునే లేటరల్ ఎంట్రీ ప్రక్రియను విపక్షాల నుంచి, భాగస్వామ్య పక్షాల నుంచి తీవ్ర విమర్శలు రావడం తో విరమించుకోవలసి వచ్చింది. లోక్‌సభ ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు వెలువడడం ఓటర్లు అసంతృప్తితో ఉన్నారనడానికి ప్రబల సాక్ష్యం. అందుకనే ఓటర్లను, మిత్రపక్షాలను అక్కున చేర్చుకోడానికి కేంద్రం అనేక మార్గాలు వెతుకుతోంది. అయితే సంస్కరణలంటూ కేంద్రం ఏవో కొన్ని చర్యలు తీసుకుంటున్నా అవి అనిశ్చిత భవిష్యత్తును ఎదుర్కొంటున్నాయి. ఇది రాజకీయ ఆర్థిక వ్యవస్థ ప్రాథమిక అంశాలకు ప్రమాదంగా ఉంటోంది. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించాలనుకుంటున్న భారత్ కు ప్రస్తుత అభివృద్ధి ఏమాత్రం సరిపోదు.దీనికోసం కొన్ని ముఖ్యమైన రంగాల్లో వ్యవస్థాపరమైన సంస్కరణలు తీసుకోవలసిన అవసరం ఉంది. అయితే వచ్చిన చిక్కంతా ఈ సంస్కరణలు రాజకీయ రిస్కు, ప్రజాకర్షక అజెండాలతో ముందుకు సాగడం లేదు. ఉదాహరణకు 2019 2020లో నాలుగు కార్మిక చట్టాలు పార్లమెంట్‌లో ఆమోదం పొందినప్పటికీ, జాబ్ మార్కెట్‌లో సంస్కరణలు తీసుకురావాలనుకుంటున్నా వీటిని అమలులోకి తీసుకురావడం కష్టతరమవుతోంది. ప్రజాకర్షక పథకాలకు వ్యయం పెరిగిపోతుండటంతో కీలకమైన విద్య, ఆరోగ్య రంగాలకు కేటాయింపులు బాగా తగ్గించవలసి వస్తోంది. దీనికి ఉదాహరణగా తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల అనుభవాలను పేర్కొనవచ్చు. ఈ ఏడాది మహారాష్ట్ర బడ్జెట్ పథకాలు రూ. 90 వేల కోట్లు మించిపోతున్నాయి. భారతదేశం యువ జనాభాతో గత రెండు దశాబ్దాలుగా అభివృద్ధి చెందిన దేశాల హోదాలోకి చేరుతోంది.అయితే అత్యధిక ఆదాయ దేశాల ర్యాంకులోకి చేరడం భారత్ వంటి మధ్యాదాయ దేశాలకు కష్టతరమవుతుందని ప్రపంచ బ్యాంకు నివేదిక ఇటీవలనే వెల్లడించింది. భౌగోళ రాజకీయ పరిస్థితుల్లో మార్పు వస్తుండటం, వాతావరణ మార్పులు, రుణస్థాయిలు పెరుగుతుండడం, దీనికి ప్రధాన కారణాలుగా ఉంటున్నాయి. ఆర్థిక పురోగతికి ఎదురవుతున్న ప్రాథమిక అడ్డంకులను పరిష్కరించుకునే ప్రయత్నాలకు బదులు ప్రజాకర్షక పథకాలపై దృష్టి కేంద్రీకరించడంతో మధ్యాదాయ ఉచ్చులో చిక్కుకుని ఏమీ చేయలేని దేశాల సరసన చేరిపోవలసి వస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రాయోజిత పథకాల్లో కోత విధించడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. రాష్ట్రాలకు అమలు చేస్తున్న పథకాల్లో తన వాటాను 75 నుంచి 50 శాతం వరకు తగ్గించేందుకు ప్రయత్నిస్తోంది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు కొన్ని పథకాలను ఇతర పథకాల్లో కలిపివేయడం కానీ లేదా అవసరాలను తీర్చలేని వాటిని తొలగించడం కానీ చేయాలనుకుంటోంది.కొన్ని పథకాలకు నిధుల విషయంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే జవాబుదారీ వహించడంతోపాటు ఎక్కువ శాతం కేటాయింపుల బాధ్యత రాష్ట్రాలే తీసుకునేలా నిబంధనలు అమలులోకి తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు ఆయా వర్గాల ద్వారా తెలిసింది. ఈమేరకు అక్టోబర్ చివరినాటికి మదింపు పూర్తి చేయనున్నారు. 2015 నుంచి ఇప్పటి వరకు కేంద్రం నిధులు కేటాయించే పథకాలను 130 నుంచి 75 వరకు తగ్గిస్తూ వచ్చారు. మరోవైపు నీతి ఆయోగ్ కేంద్ర ప్రాయోజిత పథకాలన్నిటినీ మదింపు చేస్తూ వస్తోంది. పథకాలపై ఎప్పటికప్పుడు సమీక్షించడానికి కన్సల్టెన్సీ సంస్థలను నియమించాలని నీతి ఆయోగ్ ఇప్పటికే ప్రభుత్వానికి సిఫార్సులు చేసింది.202425 బడ్జెట్‌లో పథకాల కోసం రూ. 5.05 లక్షల కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. కేటాయింపులు బాగానే ఉన్నా ఏ విధం గా ఆర్థికంగా వీటిని భరించాలన్న తర్జనభర్జనలో కేంద్రం సతమతమవుతోంది. జలశక్తి, పారిశుధ్యం, విద్యుత్, పునరుత్పాదక శక్తి, సామాజిక రంగాలకు చెందిన కొన్ని పథకాలను సమీప లేదా పెద్ద స్కీమ్‌లో భాగం చేసేలా కేంద్రం ప్రయత్నిస్తోంది. ఈ పథకాలకు తన వాటా ఎక్కువ శాతం భరించకుండా రాష్ట్రాలు ఎక్కువ శాతం భరించేలా నిబంధనల్లో మార్పులు తీసుకురావడానికి కసరత్తు చేస్తోంది. ఫలితంగా రాష్ట్రాలే చాలావరకు ఈ పథకాలకు ఆర్థిక వనరులు సమకూర్చుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది.

# కశ్మీరీ మనోభావాలకు కాలపరీక్ష



జమ్ము కశ్మీర్: రాష్ట్ర హోదా కోల్పోయిన తర్వాత లడఖ్ రహిత జమ్మూకశ్మీర్ ఒక కేంద్రపాలిత ప్రాంతమైంది. ఎప్పట్లాగే జమ్మూ, కశ్మీర్ ఈ రెండు ప్రాంతాలు వైవిధ్య రాజకీయ స్వభావాన్నే ఇంకా కనబరుస్తున్నాయి. కశ్మీర్‌లోయ ప్రధానంగా నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి)కి పట్టున్న ప్రాంతం కాగా, జమ్మూ ప్రాంతంపై బిజెపికి పట్టుంది. 2014 ఎన్నికల తర్వాత నాటకీయ పరిణామాల్లో ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పరచి, 2018 వరకు నడిపిన బిజెపి, పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ (పిడిపి)ల మధ్య ఇపుడు ఎన్నికల పొత్తేమీ లేదు. విడివిడిగానే పోటీ చేస్తున్నాయి. పిడిపి నిజానికి, కాంగ్రెస్ పరోక్ష నాయకత్వంలోని 'ఇండియా' విపక్ష కూటమిలో ఉంది. నిన్నటి లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌సి లాగే పిడిపి కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకుంది. ఇప్పుడా బంధం లేదు. సీట్ల ఒప్పందంతో ఎన్‌సి కాంగ్రెస్‌లు కలిసి పోటీ చేస్తున్నాయి. ఇక్కడొక ఆసక్తికర అంశముంది. ఈ కూటమి జమ్మూలో, బిజెపి కశ్మీర్‌లో ఏ మేరకు అదనపు ప్రభావం చూపగలవు? అన్నది స్థూలంగా రేపటి ఎన్నికల ఫలితాల మొగ్గును నిర్ణయిస్తుంది.2002 ఎన్నికల గెలుపు తర్వాత పిడిపి ఒక శక్తిగా ఎదిగినా, ఎన్‌సికి ఉన్నంత పార్టీ యంత్రాంగం వ్యవస్థ దానికిలేవు. పైగా సంకీర్ణ ప్రభుత్వం (2014-18) నడిపిన తర్వాత పిడిపి బలహీనపడిపోయినట్టు, లోక్‌సభ ఎన్నికల్లో వారి ఆధిక్యత 5 అసెంబ్లీ స్థానాలకు పడిపోవడాన్ని బట్టి తెలుస్తోంది. 2024 ఎన్నికల్లో కశ్మీర్‌లోని రెండు స్థానాలు శ్రీనగర్, అనంతనాగ్ ఎన్‌సి గెలిస్తే, బారాముల్లా నుంచి ఎన్‌సి నేత, మాజీ ముఖ్యమంత్రి ఒమర్ ఫరూఖ్‌ను, జైలు నుంచే పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థి ఇంజనీర్ రషీద్ ఓడించారు. బెయిల్‌పైన వచ్చి, ఆయనిపుడు ప్రచారం చేస్తున్నారు. అది ఎవరి అవకాశాలకు దెబ్బ? అన్నది చర్చనీయాంశమే! ఉదమ్‌పూర్‌తో సహా జమ్మూ ప్రాంతపు రెండు స్థానాలు బిజెపి నెగ్గింది. నిన్నటి ఎన్నికల్లో ఎన్‌సి (36), కాంగ్రెస్ (7) సాధించిన ఆధిక్య అసెంబ్లీ స్థానాలను కలిపితే 43. అంటే, రేపటి ఎన్నికల్లో కొంత శ్రమిస్తే మ్యాజిక్ నంబర్ 46/90 చేరుకోవడం ఈ కూటమికి సాధ్యపడొచ్చు! ఇప్పటి వరకున్న సమాచారం, సంకేతాలను బట్టి ఈ కూటమికే ఆధిక్యత కనిపిస్తోంది. పిడిపితో పాటు అప్నీ (ఎపిఎన్ఐ), గులామ్ నబీ ఆజాద్ నేతృత్వంలోని డెమోక్రాటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ (డిపిఎపి),సాజాద్‌లోనేకు చెందిన 'పీపుల్స్ కాన్ఫరెన్స్' వంటి చిన్నా చితకా పార్టీలున్నావాటి ప్రభావం అంతంతే!మంత్రానికి చింతకాయలు రాలనట్టే అభివృద్ధికి ఓట్లు పడవా? అంటే, అది సందర్భాన్ని బట్టి ఉంటుంది. గత అయిదేళ్లలో జమ్మూకశ్మీర్‌లో జరిగిన అభివృద్ధి, ఏ ప్రమాణాలతో కొలచినా ఎన్నదగిందే! కేంద్ర రాష్ట్ర పథకాలతో కలిపి, పెద్ద మొత్తం నిధులు వెచ్చించి వివిధ పనులు చేపట్టారు. అందులో ఇప్పటికే కొన్ని మొదలైతే, ఇంకొన్ని ప్రణాళికలో ఉన్నాయి. అందుకే, బిజెపి ఈ అంశానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి ప్రచారం చేస్తోంది. అధికరణం 370 ఎత్తివేసిన తర్వాత భూఉపరితల రైలు విమాన మార్గాలను కలిపే రవాణాతో పాటు ఇతర మౌలిక సదుపాయాల వృద్ధిలో, ప్రయివేటు పెట్టుబడులు రాబట్టి ఉద్యోగఉపాధి అవకాశాలు పెంచడంలో, పట్వారీ వ్యవస్థను వదిలించుకొని ల్యాండ్ రికార్డులను డిజిటలైజ్ చేయడంలో, సరిపడా విద్యుత్ ఉత్పత్తిలో%ొ% ఇలా పలు రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించినట్టు గణాంకాలతో వివరిస్తోంది. ప్రధానమంత్రి ఉపాధి కల్పన అమలులో దేశంలోనే జమ్మూకశ్మీర్ అగ్రగామిగా ఉంది.అయిదేళ్లలో ప్రత్యక్షంగా ప్రభుత్వ ఉద్యోగాలు 43 వేలు ఇస్తే, ఒక్క 2023 24 లోనే 1.2 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించినట్టు కేంద్ర గణాంకాలు చెబుతున్నాయి. పబ్లిక్ సర్వీసెస్ గ్యారెంటీ చట్టం తీసుకువచ్చి, 1100 సేవల్ని ఆన్‌లైన్ చేసిన తర్వాత, పౌరుల సౌలభ్యం పెరగటమే కాక అవినీతి రమారమి తగ్గినట్టు పాలకపక్షం ప్రచారం చేస్తోంది. విమాన రోడ్డు రైల్ మార్గాల మధ్య సమన్వయం పెంచి చేపట్టిన పలు ప్రాజెక్టులకు రూ. 1.5 లక్షల కోట్లు వెచ్చించారు. శ్రీనగర్ నుంచి జమ్మూ రావాలంటే 8 గంటలు పట్టేది, ఇప్పుడు 5 గంటల్లో హాయిగా వచ్చేస్తున్నారు. ఇది వరకు రోజూ సగటున జమ్మూ నుంచి అయిదారు, శ్రీనగర్ నుంచి 20 22 విమానాలు మాత్రం ఎగి రేవి. ఇప్పుడు%ొ% రోజూ జమ్మూ నుంచి 48, శ్రీనగర్ నుంచి 140 విమానాలు తిరుగుతున్నాయి. ప్రజల భాష కూడా మారింది. జిఐ ట్యాగ్, క్యూఆర్ కోడ్ వంటి కొత్త పదజాలం వ్యాప్తి పెరిగింది. ఇది అభివృద్ధికి సంకేతమనే భావన కశ్మీరీల్లోనూ ఉంది. కశ్మీరీలంటే, అటు లోయ, ఇటు జమ్మూ మైదాన ప్రాంతాలతో కలిపి ఉన్న ప్రదేశాల్లోని అందరూ అని లెక్క! ఇవన్నీ ఒక ఎత్తయితే, అధికరణం 370 ఎత్తివేత తర్వాత తాము శక్తి కోల్పోయినట్టు, స్వేచ్ఛా స్వతంత్ర భావన కొరవడ్డట్టు అత్యధికులు కలత చెందుతున్నారు. ఈ విషయాల్లో వారి మనోభావాలు, అభివృద్ధిని ప్రశంసించడంలో వెనుకాడుతున్నట్టున్నాయి. అందుకే, కశ్మీరీల సెంటిమెంట్ ఎన్నికల్లో కీలక పాత్ర వహించి, ఎటు మొగ్గుతుందన్నది కోటి రూకల ప్రశ్న!

కమ్మిన పొరకమ్మిన పొర

నిజానికి పౌరుల మౌలిక సమస్యలే అంతర్లీనంగా కశ్మీరీల ఓటు నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. ఆహార సంబంధ నిత్యావసరాలు, విద్యుత్తు, నీరు వంటి పౌర సదుపాయాలు, రోడ్లు, బడులు, ఆస్పత్రులు, కాలేజీలు వంటి మౌలిక వసతులు కశ్మీరీల మదిలో ఉన్నాయి. ఉన్నత విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాల విషయంలో యువత ఆందోళనతో ఉన్నారు. ద్రవ్యోల్బణం పెరిగి నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడం ఇంటింటి బాధే! ఎన్నికల వేళ కొన్ని ఇతర ప్రాధాన్యతాంశాలు వీటిని కమ్మేస్తున్నాయి. 370 ఎత్తివేసిన తర్వాత రాజ్యాంగమ్మీద ప్రజలకు విశ్వాసం పెరిగిందా? తరిగిందా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఒకటొకటిగా చోటు చేసుకుంటున్న పలు పరిణామాలను కశ్మీరీలు గమనిస్తున్నారు. ఈ ఎన్నికలకు ప్రచారం ఊపందుకున్న క్రమంలోనే, పార్టీలు ఏ వాదనలతో వస్తాయోనని జనం నిరీక్షించారు. తమ సందేహాలు, భయాలు తొలగిపోయేలా%ొ% ఎవరేం చెప్తారన్నది వారు గమనించారు. ఓటేయడానికి మాత్రం, ఓటర్లు ఇది వరకెప్పుడూ లేనంత ఉత్సాహంగా ఉన్నారు. 'ఎన్నికల బహిష్కరణ' విధానం నుంచి, 370 పునరుద్ధరించే వరకు ఎన్నికల్లో పాల్గొనేది లేదన్న పట్టుదల నుంచి%ొ%. క్రమంగా వైదొలగి, 58 శాతానికి పైబడి మొన్న (2024 ఎన్నికలు),59 శాతానికి పైబడి నిన్న (తొలివిడత) ఓటేసిన 'ఔత్సాహిక' పాత్రలోకి వారు వచ్చేశారు. జిల్లా అభివృద్ధి మండళ్ల (డిడిసి) ఎన్నికల్ని బహిష్కరించే తప్పుచేశామన్న భావన అత్యధికుల్లో ఉన్నట్టు 'పీపుల్స్ పల్స్' క్షేత్ర అధ్యయనంలో వెల్లడయింది. ఎన్నికల తర్వాత%ొ% తమను వినే, అర్థం చేసుకునే, స్పందించే ప్రభుత్వం కావాలనేది సగటు కశ్మీరీల కోరిక. సాధారణ అధికారాలతోనో, విశేషాధికారాలతోనో పనిచేసే లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జి)లనూ వారు కోరుకోవడం లేదు. అధికరణం 370 ఎత్తివేత మీద కన్నా, రాష్ట్ర హోదా తొలగిపోవడంపట్ల స్థానికులు కినుకవహించి ఉన్నారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఎప్పుడనే విషయంలో ఇంకా నీలినీడలు పరచుకొనే ఉన్నాయి. 'తగిన సమయంలో%ొ% అని ప్రధాని మోడీ పార్లమెంటులో, అమిత్ షా బయటా చెప్పారు కదా!' అంటున్న లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా మాటలు, విపరీతార్థాలు ఇస్తున్నట్టే కొందరు భావిస్తున్నారు. బారాముల్లా నుంచి లోక్‌సభకు ఎన్నికైన రషీద్ పార్లమెంటులో ప్రమాణస్వీకారం చేసి, తిరిగి జైలుకు వెళ్లాక కేంద్రంలో ఓ పరిణామం చోటుచేసుకుంది. ఎల్‌జి అధికారాల పరిధి విస్తరిస్తూ, న్యాయ పోలీసు ఆర్థిక అధికారాలను మరిన్ని జతచేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ పరిణామం పట్ల కశ్మీరీలకు భయసందేహాలు ఇంకా పెరిగాయి. ఇవన్నీ స్థానికాంశాలను, సగటు సమస్యలను కమ్మేస్తున్న అసాధారణాంశాలు. ఇవి ఏ మేరకు ఎన్నికల్లో ఫలితాలను ప్రభావితం చేస్తాయో వేచి చూడాలి.

పెనం నుంచి పొయ్యిలో పడొద్దని

పార్టీల రాజకీయ ఆలోచనలెలా ఉన్నా ప్రజల మనసెరిగి పాలించడంలోనే ప్రజాస్వామ్యపు రమ్యత ఉంది. ఆనాటి పరిస్థితుల్ని బట్టి జమ్మూకశ్మీర్‌కు రాజ్యాంగ చట్టం ద్వారా సంక్రమించిన ప్రత్యేక రక్షణలు అవసరమయ్యాయి. ఇప్పుడున్న పరిస్థితుల్ని బట్టి ఏది అవసరమో ఆ మేరకైనా పాలకులు పూచీకత్తుగా నిలవాలి. ముస్లింలకు భరోసా ఇచ్చే, వారికి రక్షణ కల్పించే వ్యవస్థలు, అవెంత బలహీనంగా ఉన్నాసరే సమూలంగా తొలగించే పాలకుల ప్రయత్నాలు ప్రజల దృష్టికి ఆనకుండా పోవు. ఆధునిక నిర్ణయాలు, చర్యలు చారిత్రక తప్పిదాలను, అన్యాయాలను సరిదిద్దకపోగా, మరింత విశృంఖల త్వపు కొనసాగింపయితే అది శాపగ్రస్తమే! అధికణం 370 ఎత్తివేస్తున్నపుడు మాట ఇచ్చిన ప్రకారమే ప్రక్రియలు సాగుతుంటే, వాటిని ప్రజలు ఆహ్వానిస్తే ఎన్‌సి, పిడిపి, కాంగ్రెస్ వంటి పార్టీలూ స్వాగతించాలి. రాజకీయ పార్టీలు తమ భాష, విషయాల అవగాహన, అభివ్యక్తి సరళి.. అదే వరుసలో మార్చుకోవాలనే కశ్మీరీలు కోరుకుంటారు. అలా కాకుండా, శాసనసభ పునరుద్ధరించినట్టే చేసి, రాష్ట్ర హోదా ఇచ్చినట్టే ఇచ్చి%ొ% మళ్లీ ఎల్‌జి దొడ్డిదారి పెత్తనంతో ఢిల్లీ బాద్ షాలే రాజ్యమేలితే కశ్మీరీలు సహించే యోచనలో లేరనే సంకేతాలు ఇప్పటికే వెలువడ్డాయి. రేపటి, మిగిలిన రెండు విడతల ఎన్నికల్లో అటో, ఇటో ముద్ర వేసి, తమ మనోగతాన్ని కశ్మీరీలు విస్పష్టంగా వెల్లడించడం ఖాయం!

# దళితులపై దాడులకు పాల్పడిన రాష్ట్రాల్లో.. బిజెపి పాలిత ఆ మూడు రాష్ట్రాలే టాప్




న్యూఢిల్లీ : 2014నుంచి బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై దాడులు అధికమవుతున్నాయి. ప్రత్యేకించి బిజెపి పాలిత రాష్ట్రాలో దళితులపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి చెప్పుకోనక్కర్లేదు. మోడీ 3.0 ప్రభుత్వంలో మిత్రపక్ష పార్టీగా ఉన్న జెడియు అధికారం ఉన్న బీహార్‌లో తాజాగా 21 పైగా దళితుల ఇళ్లకు నిప్పు పెట్టిన ఉదంతం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బిజెపి పాలిత రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో 2022 సంవత్సరంలో అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని తాజాగా విడుదల చేసిన ప్రభుత్వ నివేదికలే చెబుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో ఎస్సీలపై దాడులకు పాల్పడిన కేసులు దాదాపు 23 శాతం, రాజస్థాన్‌లో 16 శాతం, ఎస్టీలపై అఘాత్యాలకు పాల్పడిన కేసులు 30 శాతం కేసులు మధ్యప్రదేశ్‌లో నమోదయ్యాయని నివేదిక తెలిపింది.2022లో 51,656 ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు) చట్టం కింద కేసులు నమోదయ్యాయి. ఎస్సీ సంబంధిత కేసులు ఉత్తరప్రదేశ్‌లో 12,287 (23.78 శాతం), రాజస్థాన్ 8,651 (16.75 శాతం), మధ్యప్రదేశ్ 7,732 (14.97 శాతం)కేసులు నమోదయ్యాయి. ఇక ఇతర రాష్ట్రాలైన బీహార్ 6,799 (13.16 శాతం), ఒడిశా 3,576 (6.93 శాతం), మహారాష్ట్ర 2,706 (5.24 శాతం). ఈ ఆరు రాష్ట్రాల్లోనే ఎస్సీ చట్టం 81 శాతం కేసులు నమోదయ్యాయి. 2022లో భారతీయ శిక్షాస్మృతితో కలిపి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద దేశ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ చట్టం కింద 52,866 కేసులు నమోదైతే ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, హర్యానా, గుజరాత్, కేరళ వంటి 13 రాష్ట్రాల్లోనే దాదాపు 97.7 శాతం అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని ఈ నివేదిక తెలిపింది.13 రాష్ట్రాల్లో 2022లో ప్రత్యేకించి ఎస్టీలపై 9,735 కేసులు నమోదయ్యాయి. వీటిల్లో మొదటి స్థానంలో మధ్యప్రదేశ్ ఉంది. ఈ రాష్ట్రంలో 2,979 (30.61 శాతం) నమోదయ్యాయి. ఇక రెండోస్థానంలో 2,498 (25.66 శాతం)లతో రాజస్థాన్ ఉంది. ఒడిశా 773 (7.94 శాతం). మహారాష్ట్ర 691 (7.10 శాతం), ఆంధ్రప్రదేశ్ 499 (5.13 శాతం)లో కేసులు నమోదయ్యాయి.ఈ కేసుల చార్జిషీట్లు, దర్యాప్తులకు సంబంధించిన వివరాలను కూడా ఈ నివేదిక వెల్లడించింది. ఎస్సీ సంబంధిత కేసుల్లో 60.38 శాతం ఛార్జిషీట్లు దాఖలు చేసినట్లు ఈ నివేదిక తెలిపింది. అయితే 14.78 కేసుల్లో తప్పుడు వాదనలు లేదా సాక్ష్యాధారాలు సరిగ్గా లేకపోవడం వంటి కారణాల వల్ల వాటిని క్లోజ్ చేయడం జరిగిందని ఈ నివేదిక తెలిపింది. 2022 చివరి నాటికి 17,166 కేసులు విచారణ పెండింగ్‌లో ఉన్నాయి. ఇక ఎస్టీ సంబంధిత కేసులు 63.32 కేసులు ఛార్జిషీట్ దాఖలు అయ్యాయి. 14.71 శాతం కేసులు విచారణ వంటివేమీ లేకుండానే క్లోజ్ అయ్యాయి. 2,702 కేసులు విచారణ కొనసాగుతున్నాయి.ఈ చట్టం కింద ఉన్న కేసులకు నేరారోపణ రేటు తగ్గిందని తాజా నివేదిక తెలిపింది. 2020లో నేరారోపణ రేటు 39.2 శాతం ఉంటే.. 2022లో 32.4 శాతానికి పడిపోయింది. ఈ చట్టం ప్రకారం కేసులను నిర్వహించడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టులు సరిపోవడం లేదని తాజా నివేదిక ఎత్తిచూపింది. 14 రాష్ట్రాల్లో 498 జిల్లాల్లో 194 జిల్లాలు మాత్రమే కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేశాయి.కుల ఆధారిత హింసను అరికట్టడానికి, బలహీన వర్గాలకు రక్షణ కల్పించడానికి జిల్లా యంత్రాంగాల

# భక్తిలేని చోట.. పవిత్రత ఉండదు

చెన్నై,తిరుపతి ప్రసాదంలో బీఫ్ టాలో ఉందన్న వార్త అసహ్యాన్ని కలిగించిందని ఈశా ఫౌండేషన్ సంస్థాపకులు సద్గురు జగ్గీ వాసుదేవ్ చెప్పారు. హిందూ దేవాలయం భక్తులచే నిర్వహించబడాలి కానీ ప్రభుత్వాల ఆధీనంలో ఉండకూడదన్నారు. ఈ సంఘటన అసహ్యకరమైనదని.. భక్తులకు ఇచ్చిన ప్రసాదంలో జంతు కొవ్వు కలిసి ఉండడం మహాపరాధంగా పేర్కొన్నారు. హిందూ దేవాలయాల పవిత్రతను కాపాడుకోవడానికి వాటిని భక్తులు ఆధీనంలో ఉంచాలని ఉద్ఘాటించారు. అందుకే భక్తులే ఆలయాలు నడిపాలని.. ప్రభుత్వాలు గుడులపై తమ పెత్తనాన్ని విడనాడాలని తామంతా కోరేదన్నారు. వివాదాన్ని ప్రస్తావిస్తూ, సద్గురు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ఎక్స్ లో పోస్ట్ చేసారు. గొడ్డు కొవ్వు కలిసిన ప్రసాదం హిందూ భక్తులు తినేలా చేయడం అసహ్యాన్ని కలిగించేది. అందుకే దేవాలయాలు ప్రభుత్వ పాలనలో కాకుండా భక్తుల ఆధీనం నడవాలి. భక్తి లేని చోట పవిత్రత ఉండదు. హిందూ దేవాలయాలు ప్రభుత్వ పరిపాలన ద్వారా కాకుండా భక్తులైన హిందువులచే నిర్వహించబడమే మంచిది. అని ఆయన రాసుకొచ్చారు. ప్రఖ్యాత తిరుపతి దేవస్థానంలోని ప్రసాదంలో బీఫ్ టాలో మిళితమైందని వచ్చిన వార్తలకు ప్రతిస్పందనగా ఆయన ఈ ట్వీట్ చేశారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల నిరసనల మధ్య, హిందూ దేవాలయాల పవిత్రత, సమగ్రతను కాపాడే లక్ష్యంతో ఆలయ నిర్వహణను తిరిగి భక్తులకే ఇవ్వాలన్న డిమాండ్స్ పెరుగుతున్నాయి.

# దృష్టి పెట్టని అగ్ర నాయకత్వం..!

హైదరాబాద్,బీఆర్ఎస్ బలోపేతంపై ఆ పార్టీ అగ్రనాయకత్వం మీనమేషాలు లెక్కిస్తోందా? ఎమ్మెల్యేలు లేని చోట ఇన్‌చార్జుల నియామకంపై ఆసక్తి చూపకపోడానికి కారణమేంటి? ఇన్‌చార్జి పదవులు కావాలని స్థానిక నాయకత్వం పార్టీ వెంటపడుతున్నా ఎందుకు పట్టించుకోవట్లేదు.. సమర్థులు లేరనే భావనా ఇంకా టైం ఉందన్న ఆలోచనా ఇన్‌చార్జులు లేక.. తమ గోడు ఎవరితో చెప్పుకోవాలో తెలియక దిగువస్థాయిలో క్యాడర్ కకావికలమవుతున్నా, అధిష్టానంలో చలనం ఉండటం లేదన్న ప్రచారంలో నిజమెంత?

ఇన్‌చార్జుల నియామకంపై నిర్లక్ష్యం?

కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌తో పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల స్థానంలో పార్టీ ఇన్‌చార్జుల నియామకంపై బీఆర్ఎస్ నిర్లక్ష్యం వహిస్తోందనే వాదన వినిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం అధికార పార్టీ ఆకర్షణతో 10 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పిన విషయం తెలిసింది. వీరిలో కొందరు పార్లమెంట్ ఎన్నికలకు ముందే పార్టీ వీడగా, మరికొందరు లోక్‌సభ ఫలితాలు వచ్చిన తర్వాత కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. అయితే మొత్తం పది మంది పార్టీ మారితే బీఆర్ఎస్ మాత్రం కేవలం ఒక్కచోట మాత్రమే ఇన్‌చార్జిని నియమించి మిగిలిన తొమ్మిది చోట్ల ఎవరికీ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పించకపోవడంతో క్యాడర్ గందరగోళానికి గురవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. స్థానిక ఎన్నికలు తరుముకొస్తున్న వేళ.. ఇన్‌చార్జుల నియామకంపై అధినాయకత్వం దృష్టి సారించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

ఇన్ చార్జులు లేక కార్యకర్తల ఇబ్బందులు..

మొత్తం 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారినా.. వారి స్థానంలో ఇన్‌చార్జుల నియామకంపై ఎందుకు జాప్యం జరుగుతోందనే చర్చ ఎక్కువగా జరుగుతోంది. స్టేషన్ ఘన్‌పూర్‌లో మాజీ మంత్రి రాజయ్యకు ఇన్‌చార్జిగా నియమించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వలస వెళ్లిన భద్రాచలం, చేవెళ్ల, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, పటాన్‌చెరు, బాన్సువాడ, జగిత్యాల, గద్వాల నియోజకవర్గాలను మాత్రం వదిలేసిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నియోజకవర్గ బాధ్యతల కోసం పలువురు నేతలు పోటీ పడుతున్నా, అధిష్టానం మాత్రం ఎవరినీ పట్టించుకోవడం లేదంటున్నా రు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు.

మన్నె గోవర్ధన్, దాసోజు మధ్య పోటీ..

పార్టీ పట్టించుకోకపోవడం, అధికార పార్టీ నుంచి ఒత్తిడి పెరగడం, బీజేపీ కూడా ఆకర్షిస్తుండటంతో ఇన్‌చార్జులు లేని నియోజకవర్గాల్లో క్యాడర్ చెల్లాచెదురవుతున్నట్లు చెబుతున్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ మారి సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన విషయం తెలిసిందే.. నాగేందర్ బీఆర్ఎస్‌ను వీడి దాదాపు ఆర్నెల్లు అవుతున్నా, ఇంతవరకు ఆ నియోజకవర్గంలో ఇన్‌చార్జిని నియమించలేదు. ఖైరతాబాద్ ఇన్‌చార్జి పోస్టును సీనియర్ నేత మన్నే గోవర్ధన్ ఆశిస్తున్నారు. ఆయనకు పోటీగా మరో సీనియర్ నేత దాసోజు శ్రవణ్ కూడా రంగంలోకి దిగడంతో అధిష్టానం ఎటూ తేల్చుకోలేకపోతుందంటున్నారు. ఇదే సమయంలో ఎటువంటి పోటీ లేని నియోజకవర్గాలపైనా నిర్ణయం తీసుకోకపోవడమే క్యాడర్‌ను అసంతృప్తికి గురిచేస్తోందని చెబుతున్నారు.

ఇన్‌చార్జి పదవి ఎవరికి ఇవ్వాలనే విషయమై తర్జనభర్జన..

నగరంలోని కీలక నియోజకవర్గమైన రాజేంద్రనగర్‌లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కండువా మార్చేశారు. ఆయన స్థానంలో కార్తీక్ రెడ్డిని ఇన్‌చార్జ చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. కానీ, అధిష్టానం ఆ నియోజకవర్గంపై ఎలాంటి ఫోకస్ చేయలేదని చెబుతున్నారు. ఇదే సమయంలో చేవెళ్లలోనూ సరైన నేత కోసం అన్వేషణ కొనసాగుతోందని చెబుతున్నారు. ఈ నియోజకవర్గంలో ఇన్‌చార్జి పదవి కోసం చటారి దశరథ్, దేశమల్ల ఆంజనేయుల, నారాయణ పోటీ పడుతున్నారు. కానీ, అధిష్టానం మాత్రం ఎవరికి ఇన్‌చార్జి ఇవ్వాలనే విషయంపై కనీసం దృష్టి పెట్టలేదంటున్నారు. ఇదే సమయంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీతో పాటు ఆ నియోజకవర్గానికి చెందిన కీలక నేతలు జగదీశ్వర్ గౌడ్, నాగేందర్ యాదవ్ బీఆర్ఎస్‌ను వీడారు. దీంతో ఆ నియోజవర్గంలో ఎవరికి ఇన్‌చార్జి ఇవ్వాలనే విషయమై బీఆర్ఎస్ తర్జనభర్జన పడుతోందని చెబుతున్నారు.

ఆ నియోజవర్గంలో ఇన్‌చార్జి నియామకం బీఆర్ఎస్‌కు అగ్ని పరీక్షే..

ఇదే విధంగా గద్వాలలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి పార్టీ వీడగా, ఈ నియోజవర్గంలోనూ ఇన్‌చార్జి నియామకం బీఆర్ఎస్‌కు అగ్ని పరీక్ష మారిందనే టాక్ వినిపిస్తోంది. గద్వాలలో ఎమ్మెల్యేతోపాటు జడ్పీ మాజీ చైర్మన్ సరిత తిరుపతయ్య కాంగ్రెస్‌లోకి వెళ్లారు. దీంతో ఇక్కడ మాజీ ఎమ్మెల్యే గట్టు భీముడు కుటుంబ సభ్యుడైన హనుమంతు నాయుడు పేరు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి స్థానంలో ఇన్‌చార్జిగా తనను నియమించాలని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కోరుతుండగా, బీఆర్ఎస్ మాత్రం కాంగ్రెస్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి కోసం వేచి చూస్తోందని చెబుతున్నారు. ఏనుగు రవీందర్‌రెడ్డి సొంత నియోజకవర్గం ఎల్లారెడ్డి కాగా, గత ఎన్నికల్లో బాన్సువాడ టికెట్ ఇచ్చింది కాంగ్రెస్. దీంతో ఆయనను మళ్లీ పార్టీలోకి తీసుకుని ఆ రెండు నియోజకవర్గాల్లో ఎక్కడో ఓ చోట ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలని చూస్తోందట బీఆర్ఎస్.

పెద్ద దిక్కు లేక క్యాడర్ చెల్లాచెదురవుతున్నట్లు సమాచారం..

అదేవిధంగా జగిత్యాలలోనూ ఇంతవరకు ఎవరికీ ఇన్‌చార్జి పదవి ఇవ్వలేదు.

# కొనసాగనున్న కాళేశ్వరం విచారణ

హైదరాబాద్,కాళేశ్వరం ఎత్తిపోతల్లోని బ్యారేజీలపై న్యాయ విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ మళ్లీ దర్యాప్తు కొనసాగించనుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల నిర్మాణంలో పనిచేసిన ఇంజనీర్లను శనివారం వరకు విచారించనుంది. అప్పటి ఈఎన్సీలను, ఉన్నతాధికారులను ప్రశ్నించనుంది. ఈ నేపథ్యంలో అన్ని నివేదికలు ఇవ్వాలని నీటి పారుదల శాఖను కమిషన్ ఆదేశించింది. బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన ప్లేస్‌మెంట్ రిజిస్టర్, ఎంబుక్‌లను కూడా తీసుకురావాలని కమిషన్ ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ విచారణలో కమిషన్‌ను తప్పుదోవ పట్టించినా, నేరపూరితంగా వ్యవహరించినా, వారిపై అవినీతి నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేయాలని, భవిష్యత్‌లో పదోన్నతులు ఇవ్వవద్దని ప్రభుత్వానికి సిఫారసు చేసే యోచనలో ఉన్నట్లు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ వెల్లడించింది. తుది నివేదిక ఇవ్వాలని విజిలెన్స్ విభాగానికి ఆదేశాలు జారీ అయ్యాయి. కాళేశ్వరం నివేదిక ఆధారంగా కాగ్ అధికారుల నుంచి కూడా వివరాలు తీసుకోనున్నట్లు కమిషన్ తెలిపింది.

## గుజరాత్‌లో దారుణ ఘటన

గాంధీనగర్,గుజరాత్‌లో మరో దారుణం వెలుగు చూసింది.స్కూల్ ప్రిన్సిపల్ చేతిలో బాలిక హత్యకు గురైంది. కారులో విద్యార్థినిపై ప్రిన్సిపాల్ అత్యాచార చేయడానికి ప్రయత్నించడం తో బాలిక ప్రతిఘటించింది. ఈ క్రమంలో బాలిక గొంతు నులిమి చంపేసి అనంతరం మృతదేహాన్ని స్కూల్ వెనుక పడేసిన సంఘటన గుజరాత్ రాష్ట్రం దాహోద్ జిల్లా సింగ్వాద్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం?. గోవింద్ నాథ్ అనే పంతులు ఓ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడి గా పని చేస్తున్నాడు. 10.20 నిమిషాలకు గోవింద్ తన కారులో స్కూల్ కు వెళ్తుండగా బాలికను(6) తీసుకెళ్లాలని ప్రిన్సిపాల్‌ను తల్లి బతిమాలింది. దీంతో ఆరేళ్ల బాలికను కారులో ఎక్కించుకున్నాడు. మార్గం మధ్యలో బాలికపై ప్రిన్సిపాల్ అత్యాచారం చేయడానికి ప్రయత్నిస్తుండగా విద్యార్థిని ప్రతిఘటించింది. ఈ విషయం బయటకు తెలిస్తే తన పరువు పోతుందని వెంటనే బాలిక గొంతునులిమి చంపేశాడు. బాలిక మృతదేహాన్ని కారులో డిక్కీలో పడేసిన అనంతరం స్కూల్ కు వెళ్లాడు. ఎవరు లేని సమయంలో కారు డిక్కీలో నుంచి మృతదేహాన్ని బయటకు తీసి స్కూల్ వెనుక బాగంలో పడేశాడు. స్కూల్ బ్యాగ్, చెప్పులు తరగతి గదిలో పడేశాడు. సాయంత్రం కూతురు ఇంటికి రాకపోవడంతో గ్రామంలో తల్లిదండ్రులు వెతికారు. పాఠశాల ఆవరణంలో వెతకగా స్కూల్ వెనుకభాగంలో బాలిక మృతదేహం కనిపించింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ప్రిన్సిపాల్‌ను గోవింద్‌నాథ్‌ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. తానే చంపినట్లు ఒప్పుకోవడంతో అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# హైడ్రా ఎఫెక్ట్..!

హైదరాబాద్, హైదరాబాద్‌లో చెరువుల ఆక్రమణదారులను హడలెత్తిస్తున్న హైడ్రాపై సీఎం రేవంత్ మరింత దూకుడు పెంచారు. తాజాగా జరిగిన కేబినెట్ భేటీలో మంత్రులు రకరకాల వాదనలు వినిపించినా%ొ% సీఎం మాత్రం హైడ్రాపై తగ్గేదేలే అని స్పష్టం చేశారట.. హైడ్రా పనితీరుతో ప్రభుత్వానికి మంచిపేరుతో పాటు చెడ్డపేరు కూడా వస్తోందన్న భయాన్ని కొందరు మంత్రులు కేబినెట్ సమావేశంలో ప్రస్తావించినా.. భవిష్యత్ తరాల కోసం హైడ్రాకు భరోసాగా నిలవాల్సిన అవసరాన్ని తేల్చిచెప్పారట సీఎం. దీంతో హైడ్రా మరింత పదునెక్కి ఆక్రమణదారుల కోరలు పీకేయడం ఖాయమన్న టాక్ వినిపిస్తోంది.

చెరువుల ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న హైడ్రా..

హైడ్రా%ొ% ఇప్పుడు తెలంగాణతోపాటు దేశంలో ఎక్కడ చూసినా ఈ అంశంపైనే చర్చ జరుగుతోంది. హైదరాబాద్ నగరంలోని చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారి ఆట కట్టించేందుకు తెలంగాణ ప్రభుత్వం రెండు నెలల క్రితం హైడ్రాను ఏర్పాటు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా గ్రేటర్ హైదరాబాద్ లో చెరువుల ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. బడాబాబులు మొదలు సామాన్యుల వరకు చెరువులను ఆక్రమించి కట్టిన కట్టడాలన్నింటిని నేలమట్టం చేస్తోంది హైడ్రా. ఈ క్రమంలో ఇప్పటివరకు సుమారు 100 ఎకరాల ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది హైడ్రా. ఈ పరిస్థితుల్లో హైడ్రాకు మరిన్ని అధికారులు కట్టబెట్టడంతోపాటు న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా చట్టబద్దత కల్పించాలని నిర్ణయించింది ప్రభుత్వం. ఈ క్రమంలోనే శుక్రవారం సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో చర్చించి హైడ్రాకు మరిన్ని అధికారాలు కట్టబెడుతూ నిర్ణయం తీసుకున్నారు.

హైడ్రాతో ప్రభుత్వ ఆదాయం తగ్గినట్లు క్యాబినెట్ లో ప్రస్తావన..

ఐతే క్యాబినెట్ భేటీలో హైడ్రాపై చర్చ సందర్భంగా మంత్రుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలుస్తోంది. హైడ్రాపై ప్రజల్లో ఓవైపు ప్రశంసలు వస్తుండగా.. మరోవైపు వ్యతిరేకత వ్యక్తమవుతోందని కొందరు మంత్రులు సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. మరీ ముఖ్యంగా హైడ్రా పనితీరుపై సామాన్యుల్లో ఆందోళనలను ఒకరిద్దరు మంత్రులు సీఎం రేవంత్ రెడ్డికి చెప్పారట.హైడ్రా ఏర్పాటు తర్వాత.. రిజిస్ట్రేషన్ల ద్వారా సమకూరే ప్రభుత్వ ఆదాయం తగ్గిపోయిందనే విషయాన్ని కూడా ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పై హైడ్రా తీవ్ర ప్రభావం చూపుతోందని, హైడ్రా ఎఫెక్ట్ తో గ్రేటర్ లో నిర్మాణ రంగం పూర్తిగా దెబ్బతింటుందేమోననే అభిప్రాయాన్ని కొందరు మంత్రులు కేబినెట్ సమావేశంలో వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

రూ.400 కోట్ల రిజిస్ట్రేషన్ల ఆదాయం తగ్గిందని సమాచారం..

హైడ్రా దూకుడు ప్రభావం రిజిస్ట్రేషన్లపై స్పష్టంగా కనిపిస్తోందని మంత్రివర్గం సమావేశంలో ఓ సీనియర్ మంత్రి గుర్తు చేశారని తెలుస్తోంది. హైడ్రా ఎఫెక్టుతో ఆగస్టులో సుమారు 400 కోట్ల రూపాయల రిజిస్ట్రేషన్ల ఆదాయం తగ్గిందని సదరు మంత్రి ఆవేదన వ్యక్తం చేశారట. హైడ్రా పనితీరుతో గ్రేటర్ హైదరాబాద్ లో నిర్మాణ సంస్థలు, బిల్డర్లు కొత్త నిర్మాణాలపై అనుమతులు తీసుకోవడానికి జంకుతున్నారన్న విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారట మరో సీనియర్ మంత్రి.ఇలాంటి సమయంలో హైడ్రాకు మరిన్ని అధికారాలు కట్టబెట్టి, చట్టబద్ధత కల్పిస్తే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని ఒకరిద్దరు మంత్రులు క్యాబినెట్ సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారని సమాచారం. హైడ్రా మంచి ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసినా, అది ప్రభుత్వ భూములను రక్షిస్తున్నా..అదే సమయంలో ఎదురవుతున్న ప్రతికూలతలను సైతం పరిగణలోకి తీసుకోవాలని మంత్రులు సూచించారని తెలుస్తోంది.

భవిష్యత్తు తరాలకు మంచి జరుగుతుందని ముఖ్యమంత్రి భావన..

హైడ్రాపై మంత్రివర్గ సహచరుల అభిప్రాయాలు, సూచనలను సావదానంగా విన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అంతే సూటిగా స్పష్టంగా సమాధానం చెప్పారని సమాచారం. ప్రస్తుత పరిస్థితుల్లో హైడ్రాపై ఏ మాత్రం వెనక్కి తగ్గేది లేదని, ఆ సంస్థకు పూర్తిస్థాయి అధికారాలు కట్టబెట్టి, చట్టబద్ధత కల్పించడంలో వెనకడుగు వేసేదే లేదని తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది.

# జమిలి ఎన్నికలు..ఒక దేశం ఒక పార్టీ కోసమా?




న్యూఢిల్లీ,ఎన్నికల ఖర్చు ఇప్పుడు ఎంత అవుతుందనుకుంటున్నా రు? ఊహాగానాలు అవసరం లేదు. మనం ప్రతి ఎన్నికల్లో చూ స్తూనే ఉన్నాం. గ్రామ పంచాయితీల దగ్గర నుండి పార్లమెంటు ఎన్నికల దాకా సామాన్యుడు ఎవడూ పోటీ చేయడానికి సాహ సించనంతగా ఎన్నికల ఖర్చులు పెరిగిపోయాయి. గ్రామ పం చాయితీ ఎన్నికలలో సర్పంచ్‌గా పోటీ చేస్తున్న వాళ్ళు కనీసం కోటి రూపాయలు ఖర్చు చేస్తున్న సందర్భాలు మన కళ్ల ముం దు కనబడుతున్నాయి. ఇక శాసనసభ, లోకసభ ఎన్నికల ఖ ర్చుల గురించి చెప్పాల్సిన పని లేదు. శాసనసభకు పోటీ చేసే అభ్యర్థి అధమపక్షం 50 కోట్లు, లోకసభకు పోటీ చేసే అభ్య ర్థులు మూడు నాలుగు వందల కోట్ల వరకూ ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి నేడు నెలకొనిఉంది. మన రాజకీయ నాయకులు బహి రంగంగా ఒప్పుకోరు.. ఎక్కువ ఖర్చు చేసినట్టు ఎన్నికల సం ఘానికి తెలిస్తే అనర్హత వేటు పడుతుందని, ఆదాయపు పన్ను శాఖ లెక్కలు అడుగుతుందనీ.ఎన్నికలలో అభ్యర్థులు, పార్టీలు పెట్టే ఖర్చు విషయంలో మన తెలుగు రాష్ట్రాలతో పోల్చితే మిగతా దేశమంతటా కొంచెం మె రుగయిన పరిస్థితే ఉంటుంది. ఉత్తరాదిలో ఎన్నికలు మరీ ఇం త ఖరీదు అయిపోలేదని చెపుతుంటారు. ఒక బడా కాంట్రాక్టర్ స్వయంగా చెప్పిన మాట మేం ఉత్తరాదిలో కూడా కాంట్రాక్టు లు చేస్తాం, అక్కడ రాజకీయ నాయకులకు లక్షల్లో ముడుపులి స్తే మహా సంతోషపడి పోతుంటారు, మన ముందు చేతులు క ట్టుకుని నిలబడతారు. ఇక్కడైతే కోట్లల్లో.. అదీ ఒకటి, రెండు కాదు.. వందల కోట్లలో ఇచ్చుకోవాలి అని. ఎన్నికల ఖ ర్చులు ఎలా పెరిగితే అలా ముడుపులు కూడా పెరగాల్సిందే కదా.మితిమీరిన ఎన్నికల వ్యయానికి సంబంధించి తెలంగాణాలో రెండు ఉదాహరణలు చెపుతుంటారు. ఉమ్మడి కరీంనగర్ , నల్లగొండ జిల్లాల్లో వరుసగా రెండు సంవత్సరాలు రెండు ఉప ఎన్నికలు జరపాల్సి వచ్చింది.2021 లో అప్పటి అధికార భా రత రాష్ట్ర సమితి బహిష్కరణకు గురైన సీనియర్ నాయ కుడు ఈటల రాజేందర్ రాజీనామా కారణంగా హుజూరాబా ద్‌లో, 2022లో కాంగ్రెస్ నుంచి వైదొలగిన కారణంగా శాసన సభ్యత్వానికి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాజీనామా చేయ దంతో మునుగోడులో ఉప ఎన్నికలు జరిగాయి. ఆ ఉప ఎన్నిక లలో హుజూరాబాద్‌లో బీజేపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్ గె లిస్తే, మునుగోడులో బీజేపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఓడిపోయారు. ఈ రెండు నియోజకవర్గాల ఉపఎన్నికలూ భారతదేశ ఎన్నికల చరిత్రలో గుర్తుండిపోతాయి. అందుకు కా రణం ఆ రెండు ఉప ఎన్నికలలో అధికార, ప్రతిపక్షాలు పెట్టిన వందల కోట్ల రూపాయల ఖర్చు, అవి ఇచ్చిన అలవిమాలిన హామీలు గతంలో ఎప్పుడూ చూసి ఉండం. భవిష్యత్తులోనూ చూడకపోవచ్చు. ఈ రెండు ఉపఎన్నికలలో తలపడిన రెండు ప్రధాన పార్టీలు అప్పట్లో ఒకటి రాష్ట్రంలో అధికారంలో ఉంటే ఇంకొకటి కేంద్రంలో అధికారంలో ఉన్నది.ఉ ప ఎన్నికలు కాబట్టి అంత ఎక్కువ ఖర్చు అయి ఉంటుందని రాజకీయ పార్టీలు సమర్ధించుకోవచ్చు. సాధారణ ఎన్నికల్లో కూడా ఎన్నికల వ్యయం ప్రారంభంలో చెప్పుకున్నట్టు వందల కోట్లకు తగ్గేదేలే అన్నట్టుగానే కొనసాగుతున్నది పరిస్థితి. ఇక ఎన్నికల్లో ఇతర అంశాల విషయానికి వస్తే హింసను గురించి, ఇతర అక్రమాలను గురించి ఇంకో తెలుగు రాష్ట్రం ఆంధ్ర ప్ర దేశ్ గురించి మాట్లాడుకోవాలి. ఈ రెండే కాదు ఆంధ్ర ప్రదేశ్ ను ఉదాహరణగా తీసుకున్నప్పుడు కేంద్ర ఎన్నికల సంఘం నిష్క్రియాపరత్వాన్ని కూడా గుర్తు చేసుకోవాలి. ఎన్నికల సంద ర్భంగా అక్కడ కొన్నిచోట్ల జరిగిన హింసాకాండ, పోలింగ్ లో జరిగిన అక్రమాలను ఎన్నికల సంఘం అడ్డుకోలేకపోయింది. దేశం మొత్తంలోనే దాదాపు 75 లోకసభ నియోజకవర్గాలలో పోల్ అయిన ఓట్ల కంటే లెక్కించిన ఓట్ల సంఖ్య ఎక్కువ అని వచ్చిన ఫిర్యాదుల మీద ఎన్నికల సంఘం నిమ్మకు నీరెత్తినట్టు ఉ ండిపోయింది. ఇలా జరిగిన వాటిలో తగినన్ని నియోజకవ ర్గాలు ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఉన్నాయి. ఎన్నికలసంఘం అనే ఒక స్వతంత్ర ప్రతిపత్తితో వ్యవహరించాల్సిన వ్యవస్థ మీద జనానికి నమ్మకం పోయే పరిస్థితి ఇది.ఈ సోది అంతా ఇప్పు డెందుకు, సందర్భం ఏమిటి అంటే రెండు, మూడు రోజుల క్రి తం కేంద్ర మంత్రిమండలి మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవిం ద్ నేతృత్వంలోని ఒక కమిటీ ఇచ్చిన నివేదికను ఆమోదించడ మే కారణం. రానున్న పార్లమెంటు శీతాకాల సమావేశాలలో ఇది ఉభయ సభల ముందుంచి ఆమోదింప చేసుకుంటామని కూడా కేంద్ర మంత్రి మండలి ప్రకటించింది. ఈ నివేదిక 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' అన్న అంశానికి సంబంధించి. కొన్ని వేల పే జీల ఈ నివేదిక ఒక సంవత్సర కాలంలో దేశంలో ఎవరిని సంప్రదించి, ఎలా తయారు చేశారో తెలియదు. రామ్ నాథ్ కోవింద్ కమిటీని కేంద్ర ప్రభుత్వం 2023 సెప్టెంబర్ మాసం లో ఏర్పాటు చేసింది. సరిగ్గా సంవత్సరం తిరగకుండా నివేదిక ఇచ్చేశారు. దేశం అంతటా శాసనసభలకు, లోకసభకు ఒకేసా రి ఎన్నిక జరపడం మంచిదన్నది ఈ నివేదిక చేసిన సిఫార్సు. అది మొదటి దశ అయితే రెండో దశ దేశంలోని స్థానిక సంస్థల న్నీటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం.ఇలా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడానికి కేంద్రంలో అధికారంలో ఉన్న ప క్షం చూపుతున్న ప్రధానకారణం ఎన్నికల వ్యయం కాగా ఐ దేళ్లూ దేశంలోని ఏదో ఒక మూల ఎన్నికలు జరుగుతుంటే అ భివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు ఎన్నికల కోడ్ అమలు లో ఉన్నందున కుంటుపడుతున్నదన్న కారణం రెండవది. 'ఒ కే దేశం- ఒకే ఎన్నిక' మంచి చెడుల చర్చలోకి పోయే ముందు ఒక్క విషయం మాట్లాడుకోవాలి. మన పాలకులకు అత్యున్నత రాజ్యాంగ వ్యవస్థల మీద గౌరవం తగ్గిపోతున్నదనడానికి ఒక మంచి ఉ దాహరణ ఈ కమిటీకి రామ్ నాథ్ కోవింద్ ను అధ్య క్షుడిగా నియమించడం. ఆయన పూర్వం రాజకీయ నాయకు డే కావచ్చు కానీ ఒకసారి అత్యున్నత రాజ్యాంగ పదవిని అలంకరించిన తరువాత ఈ పనికి నియమించి ఉ ండాల్సింది కాదు. ఆయన కూడా ఒప్పుకోవలిసింది కాదు. ఇది రాష్ట్రపతి పదవి గౌరవాన్ని తగ్గించినట్టు అయింది.ఇక దేశమంతటా ఒకేసారి ఎన్నికలు అనే అంశానికి వస్తే రాజ కీయ పక్షాలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. దేశంలో ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలిగించే రాజకీయ కుట్రగా భా విస్తున్నాయి. ప్రాంతీయ పార్టీల మనుగడకు నష్టం వాటిల్లే రీతి లో ఉంది ఇది అని కూడా కొన్ని రాజకీయ పక్షాలు భావిస్తున్నా యి. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతదేశంలో ఈ చర్య స రైంది కాదంటున్నాయి. నిజమే, మన దేశంలో భిన్న సంస్కృ తులు, భాషలూ, సాంప్రదాయాలు ఆచరణలో ఉన్నాయి.అదలాఉంచితే , 2029 ఎన్నికలకు 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' పద్ధతి తీసుకురావాలన్న తొందరలో కేంద్రం ఉన్నట్టు కనిపిస్తు న్నది. అదెలా సాధ్యపడుతుందో ఆలోచించాలి. ఇది అమలు కావడానికి ముందు చాలా తతంగం ఉంది. కనీసం 18 రా జ్యాంగ సవరణలు అవసరం అవుతాయి. పార్లమెంటు ఉభయ సభల్లో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. ప్రస్తుత ఎన్డీఏ కూటమి అది సాధించే పరిస్థితి ఉందా? కనీసం దేశం లోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలోని ప్రభుత్వాలలో సగం అయిన ఆమోదించాలి.ఇంత తతంగం పూర్తి చేసుకుని 'ఒకే దేశం' ఒకే ఎన్నిక' ప్రయోగం అమలు చేస్తారనుకుం దాం. ఏ కారణం చేతనయినా ఒక రాష్ట్రంలోనో, కొన్ని రాష్ట్రాల లోనో ప్రభుత్వాలు అర్థంతరంగా పతనం అయితే ఏమిటి మార్గం? వాటికి మిగిలిన కాలానికి ఎన్నికలు నిర్వహిస్తామం టే ఎన్నికయిన ప్రభుత్వాలకు అయిదేళ్ళ పదవీకాలం ఉండా లన్న నియమం మాటేమిటి?ఇక్కడే ఆరంభంలో మాట్లాడుకున్న ఎన్నికల వ్యయం , హింస , అక్రమాల ప్రస్తావన అవసరం అవుతున్నది. చాలాకాలంగా దేశంలో ఎన్నికల సంస్కరణల గురించి పెద్దయెత్తున చర్చ జరు గుతున్నది. ఎన్నికలలో ధనం, మద్యం తదితర ప్రలోభాలను కట్టడి చేయడానికి, హింసని కఠినంగా అణచివేయడానికి, ఇత ర అక్రమాలను అరికట్టడానికి పకడ్బందీగా సంస్కరణలు తీ సుకువచ్చి ఎన్నికల్లో ప్రజాస్వామ్య వాతావరణం నెలకొల్పే ఆలోచన మానేసి ఈ 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' ప్రయోగం చేయ డం సరయింది కాదు.ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ ప్రయోగం మీద స్పందిస్తూ అన్న మాటలను గుర్తు చేసుకోవాలి. ఇప్పుడు దేశానికి తక్షణ అవసరం ఒకే దేశం ఒకే విద్య , ఒకే దేశం ఒకే వైద్యం అన్నారు కేజ్రీవాల్. ఒక దేశంలో నివసించే వారందరికీ పేద గొప్ప తారతమ్యాలు లేకుండా ఒకే రకమయిన విద్య, వైద్య సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వాలు కృషి చేయా లని అర్థం. అంతేకానీ 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' అన్న ఆలోచన సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం.

# కామన్వెల్త్ మహిళా పార్లమెంటరీ కమిటీ సభ్యురాలిగా పురందేశ్వరి

న్యూఢిలీ: బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సిపిఎ) ఇండియా రీజియన్ ప్రతినిధిగా కామన్వెల్త్ మహిళా పార్లమెంటరీ స్టీరింగ్ కమిటీ సభ్యురాలిగా నామినేట్ అయ్యారు. ఈమేరకు లోక్‌సభ స్పీకర్ ఓ బిర్లా ఉత్తర్వులు ఇచ్చారు. 2026 చివరి వరకు ఈ నియామకం వర్తిస్తుంది. సిపిఎ ఇండియా రీజియన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలుగానే కాకుండా మహిళా పార్లమెంటేరియన్ల, స్టీరింగ్ కమిటీకి ఛైర్‌పర్సన్‌గా కూడా ఆమె వ్యవహరిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# లడ్డూల నుంచి అన్నప్రసాదాల వరకు దోపిడీ

గుంటూరు, వైకాపా హయాంలో తితిదేలో దొంగల ముఠాను పెట్టి లడ్డూల నుంచి అన్నప్రసాదాల వరకు దోపిడీ చేశారని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మండిపడ్డారు. తప్పు చేయకపోతే సుబ్బారెడ్డి విజిలెన్స్ విచారణకు సహకరించొచ్చు కదా అని అన్నారు. నిజాయతీగా ఉంటే.. నిబంధనలు మార్చి మరీ ధర్మారెడ్డిని ఈవోగా ఎందుకు తీసుకొచ్చారని అన్నారు. అధికారంలోకి రాగానే నిబంధనలు మార్చి ప్రైవేట్ డెయిరీకి నెయ్యి కాంట్రాక్టు ఎందుకిచ్చారో చెప్పాలన్నారు. నెయ్యి పేరిటే రూ.450 కోట్లు దోచుకుంటే... శ్రీవారి సంపదల్ని ఏం చేశారో కూడా విచారించాలి. ఈ క్రిమినల్స్ నేతృత్వంలో ఐదేళ్లు ఆలయాల్లో ఏం జరిగిందో ఊహించడానికే భయమేస్తోంది? ప్రభుత్వం వేసిన సిట్ ద్వారా జగన్ పాపాల పుట్ట పగలగడం ఖాయం. అధికారం నుంచి దించడం కాదు, రాష్ట్రం నుంచే తరిమికొట్టే రోజు త్వరలోనే రానుందని జీవీ ఆంజనేయులు తెలిపారు. బాబాయ్ వైవీ సుబ్బారెడ్డిని అడగాల్సిన విషయాలపై ప్రధానికి లేఖ రాస్తే ఉపయోగమేంటని వైకాపా అధ్యక్షుడు జగన్‌ను వినుకొండ ఆంజనేయులు ప్రశ్నించారు. సుబ్బారెడ్డికి స్వామి పట్ల ఎంత భక్తి ఉందో సేవల ధరల పెంపుతో దేశం మొత్తం చూసిందని ఎద్దేవా చేశారు. భూమన కరుణాకర్ రెడ్డి ఎంతటి స్వామి భక్తుడో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని వ్యాఖ్యానించారు.

## హాట్ టాపిక్‌గా మారిన కొత్త రూల్..!

హైదరాబాద్,: పీసీసీ బాస్ మహేశ్‌కుమార్ గౌడ్ కాంగ్రెస్ నేతలకు కొత్త రూల్ పాస్ చేశారు.పార్టీయే సుప్రీం అన్నట్లు ఆయన తీసుకున్న తాజా నిర్ణయం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. ప్రస్తుతం ఏపీలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అమలు చేయాలనుకున్నారో ఇంకేదైనా రాష్ట్రం నుంచి నేర్చుకున్నారో గానీ, తొమ్మిది నెలల పాలన తర్వాత ప్రభుత్వానికి-పార్టీకి మధ్య సమన్వయం ఉండేలా పీసీసీ చీఫ్ తీసుకున్న తాజా నిర్ణయం హాట్‌టాపిక్‌గా మారింది. ఇంతకీ కాంగ్రెస్ కొత్త అధ్యక్షుడు తీసుకున్న ఆ సరికొత్త నిర్ణయం ఏంటి..దానిపై కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతున్న చర్చ ఏంటి?

సీఎం, మంత్రులు గాంధీభవన్ కు రావాల్సిందే..!

ప్రజా ప్రభుత్వంగా చాటుకుంటున్న రేవంత్‌రెడ్డి సర్కార్ ఇప్పుడు పార్టీ బాట పట్టనుంది. ఏపీలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న విధంగా పార్టీ కార్యాలయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలను తెలుసుకోవాలని నిర్ణయించిన పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్%ొ%. ముఖ్యమంత్రి, మంత్రులంతా గాంధీభవన్‌కు రావాలని తాజాగా ప్రతిపాదించారు.ప్ర భుత్వమంటే సచివాలయం, అసెంబ్లీ.. ముఖ్యమంత్రి, మంత్రులే కాదని ప్రభుత్వంలో పార్టీ కూడా ఓ భాగమని చెప్పాలనుకున్న పీసీసీ చీఫ్.. నెలకొకసారైనా సీఎం రేవంత్‌రెడ్డి గాంధీభవన్‌లో అందుబాటులో ఉండాలని కోరుతున్నారు.. అదేవిధంగా మంత్రులు కూడా వారానికి రెండుసార్లు పార్టీ క్యాడర్ కష్టనష్టాలు తెలుసుకునే విధంగా గాంధీభవన్‌కు రావాలని సూచించారు. పీసీసీ చీఫ్ ప్రతిపాదనకు సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఇకపై మంత్రులు వారం వారం గాంధీభవన్‌లో ప్రత్యక్షం కావడం తప్పనిసరిగా మారింది.

మహేశ్ కుమార్ గౌడ్ ది తన మార్క్ చాటుకునే ప్రయత్నమా?

వాస్తవానికి ప్రజా ప్రభుత్వంగా తొలి నుంచి చెబుతున్న రేవంత్‌రెడ్డి సర్కార్.. ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ప్రజా భవన్‌లో ప్రజాదర్బార్‌కు శ్రీకారం చుట్టింది. తొలుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, సీతక్క వంటి వారు కొద్దిరోజులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహించే ఈ కార్యక్రమ బాధ్యతలను ఆ తర్వాత ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డికి అప్పగించారు.ఈ కార్యక్రమం ప్రభుత్వ పరంగా నిర్వహిస్తుండగా, మంత్రులను ఇన్‌వాల్వ్ చేస్తూ%ొ% వారిని గాంధీభవన్ రప్పించే ప్లాన్ చేశారు పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్. కొద్ది రోజుల క్రితం వరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉన్నా%ొ% ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదు. కానీ, పార్టీలో తన మార్క్ చాటుకోవాలనే ప్రయత్నంతో మహేశ్‌కుమార్ గౌడ్ కొత్త స్కీమ్‌కు తెరతీశారా? అన్న చర్చ జరుగుతోంది.

మంత్రులకు పార్టీ డ్యూటీ..

పార్టీ కార్యాలయంలో మంత్రులు అందుబాటులో ఉండాలని పీసీసీ చీఫ్ నిర్ణయించడంతో సీఎం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారంటున్నారు. ప్రజాభవన్‌లో మంగళ, శుక్రవారాలు జరుగుతుండగా.. గాంధీభవన్‌లో బుధ, శుక్రవారాల్లో మంత్రులు అందుబాటులో ఉండేలా నిర్ణయించినట్లు చెబుతున్నారు. దీంతో మంత్రులకు విడతల వారీగా గాంధీభవన్ డ్యూటీ వేస్తారని చెబుతున్నారు.

పీసీసీ చీఫ్ నిర్ణయం వెనుక పెద్ద ప్లాన్..!

పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం వెనుక పెద్ద ప్లానే ఉందని చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ పదేళ్లు అధికారంలో కొనసాగాలంటే కార్యకర్తలను ప్రోత్సహించాల్సి వుందన్న ఆలోచనే ఈ కార్యక్రమానికి ప్రేరణగా చెబుతున్నారు. ఇదే సమయంలో పక్క రాష్ట్రంలో ప్రతి రోజూ ప్రజల నుంచి మంత్రులు ఫిర్యాదులు స్వీకరిస్తుండటం కూడా కాంగ్రెస్ అధ్యక్షుడిని ఆకర్షించిందని అంటున్నారు.మరోవైపు రాష్ట్రంలో ఎంఐఎం వంటి చిన్న పార్టీలు సైతం తమ ఎమ్మెల్యేలను పార్టీ కార్యాలయంలో కూర్చోబెట్టి ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నారని%ొ% అందువల్లే ఎంఐఎం పార్టీ పాతబస్తీలో పాతుకుపోయిందని ప్రచారం ఉంది. ఇవన్నీ గమనించే రాష్ట్రంలో కాంగ్రెస్ మంత్రులు కూడా పార్టీ కార్యాలయానికి రావాల్సిందిగా పీసీసీ చీఫ్ ప్రతిపాదించారంటున్నారు. ఇక సీఎం కూడా ఓకే చెప్పడంతో వచ్చే వారమే ఈ కార్యక్రమం మొదలయ్యే అవకాశం ఉందంటున్నారు.ఇతర రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు ఈ విధానాన్ని అనుసరిస్తున్నా%ొ% కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీ ఈ కార్యక్రమాన్ని ఎలా నిర్వహిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. అసలే కాంగ్రెస్‌లో నేతల తాకిడి ఎక్కువ%ొ% వారి కోరికలకు అడ్డూ అదుపు ఉండే పరిస్థితి లేదంటున్నారు. ఈ పరిస్థితుల్లో మంత్రులను పార్టీ కార్యాలయానికి రప్పించడం ద్వారా కాంగ్రెస్‌ను ప్రాంతీయ పార్టీలకు దీటుగా తయారు చేయాలనే ప్లాన్ కనిపిస్తున్నా సీనియర్ నేతల తాకిడి ఎక్కువగా ఉంటే కాంగ్రెస్ పార్టీకి ఈ కార్యక్రమం సవాల్‌గానే చెబుతున్నారు. మరి ఈ సవాల్‌ను ఆ పార్టీ యంత్రాంగం ఎలా అధిగమిస్తుందనేది చూడాల్సివుంటుంది.

# బంగారం ధరలు మరింత పైపైకి



ముంబై,రూపాయి విలువ మరింత దిగజారింది. బంగారం ధరలు పైపైకి పోతున్నాయి. దీంతో మన ఆర్థిక వ్యవస్థలో కొంత ఒడిదుడుకులు తప్పేలా లేవు. విదేశీ మారక నిల్వలపై దీని ప్రభావం పడనుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే దిగుమతులపైనా ప్రభావం ఉంటుందని అంటున్నారు. వంటనూనెల ధరలు అమాంతంగా పెరగడంతో ఇప్పుడు సామాన్యులపై మళ్లీ భారం పడుతోంది. ధరల అదుపులో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అవుతోంది. పుంకాలు తగ్గించినా బంగారం, వెండి ధరల పరుగులు ఆగడం లేదు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపు నేపథ్యంలో రూపాయి పతనం కొనసాగుతోంది. రూపాయి విలువ మరింత దిగజారింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా డాలరుతో పోల్చితే 83.53కు పెరిగింది. ఉక్రెయిన్‌లో మళ్లీ ఉద్రిక్తతలు పెరగడం, ద్రవ్యోల్బణం కట్టడి లక్ష్యంగా వేర్వేరు దేశాల కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు పెంచుతున్న నేపథ్యంలో.. సురక్షిత పెట్టుబడుల వైపే మదుపర్లు మొగ్గుచూపుతున్నారు. డాలరుపై పెట్టుబడులే భద్రమని వారు భావిస్తున్నారు. ఫలితంగా అమెరికన్ కరెన్సీ క్రమంగా బలపడుతోంది.అమెరికా ఫెడరల్ రిజర్వ్ మున్ముందు కూడా వడ్డీ రేట్ల పెంపు ఉంటుందని స్పష్టమైన సంకేతాలిచ్చింది. ఈ పరిణామాల మధ్య మదుపర్లు లాభాలు బాగుంటాయనే ఆశతో అమెరికా మార్కెట్ల వైపు మొగ్గుచూపుతుం డగా.. ఆ దేశ కరెన్సీ పుంజుకుంటోంది. రూపాయి ఒత్తిడికి గురవుతోంది. సాధారణంగా రూపాయి పతనాన్ని ఎదుర్కొనేందుకు రిజర్వు బ్యాంకు జోక్యం చేసుకుంటుంది. డాలర్ల విక్రయం ద్వారా రూపాయి మరింత క్షీణించకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తుంది. అయితే.. విదేశీ మారక నిల్వలు భారీగా తగ్గిన నేపథ్యంలో ఆర్‌బీఐ ఏం చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. రూపాయి క్షీణత వల్ల సామాన్యుడి బతుకు భారమవుతుంది. ద్రవ్యోల్బణం పెరుగుతుంది. వస్తు సేవలకు అధికంగా చెల్లించాల్సి వస్తుంది. విదేశాల నుంచి దిగుమతయ్యే వంటనూనె, పప్పుదినుసులకూ అధిక ధరలు చెల్లించాలి. అంతర్జాతీయ వ్యాపారం డాలర్లలోనే జరుగుతుంది కాబట్టి, సరఫరా చేసిన దేశానికి వాటిల్లోనే చెల్లించాలి. రూపాయి విలువ క్షీణిస్తే డాలర్ల కోసం ఎక్కువ వెచ్చించాల్సి వస్తుంది. ముడి సరకుల్లో అత్యధిక భాగం దిగుమతి చేసుకునే పరిశ్రమలు కరెన్సీ విలువ క్షీణత వల్ల దెబ్బతింటాయి. ఇతర దేశాలకు విహారయాత్రలకు వెళ్లాలంటే అధికంగా ఖర్చవుతుంది. విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులపై కూడా భారం పెరుగుతుంది. తమ వస్తువులను, సేవలను ఇతర దేశాలకు ఎగుమతి చేసే రంగాలు కరెన్సీ విలువ క్షీణత వల్ల లబ్ధి పొందుతాయి. ముఖ్యంగా భారత ఐటీ, ఫార్మా రంగాలకు ఈ పరిస్థితి వల్ల ప్రయోజనం చేకూరుతుంది. డాలరుకు ఎక్కువ రూపాయలు అందుతాయి కాబట్టి రూపాయి క్షీణత వల్ల ప్రవాస భారతీయ కుటుంబాలు లాభపడతాయి. పెరుగుట.. విరుగుట కొరకే అన్న సామెత బంగారానికి మాత్రం వర్తించడం లేదు. ఎంత పెరిగినా తగ్గేది మాత్రం కొంతే. బంగారం, వెండి ధరల్లో హెచ్చుతగ్గులు సర్వసాధారణం. కానీ తగ్గినప్పుడు చాలా హ్యాపీ అనిపిస్తుంది. అయితే తగ్గిన దానికి డబుల్ పెరిగిందో చాలా ఇబ్బందికరంగా అనిపిస్తుంది. ప్రస్తుతం అదే జరిగింది. బంగారం తగ్గిందనుకుని సంతోషించే లోపు తగ్గినదానికి డబుల్ పెరిగింది. అమెరికాలో, భవిష్యత్ వడ్డీ రేట్ల కోతలను దృష్టిలో పెట్టుకుని ఇన్వెస్టర్లు బంగారాన్ని ఎక్కువగా కొంటున్నారు, దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో గోల్డ్ రేటు హై రేంజ్‌లో ఉంది. ప్రస్తుతం, ఔన్స్ (28.35 గ్రాములు) బంగారం ధర 2,654 డాలర్ల వద్ద ఉంది. మన దేశంలో, 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి (24 కేరెట్లు) ధర 220 రూపాయలు, ఆర్నమెంట్ గోల్డ్ (22 కేరెట్లు) ధర 200 రూపాయలు, 18 కేరెట్ల బంగారం రేటు 160 రూపాయల చొప్పున పెరిగాయి. వెండి రేటులో ఎలాంటి మార్పు లేదు. మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 76,150 వద్దకు; 22 క్యారెట్ల బంగారం ధర 69,800 వద్దకు; 18 క్యారెట్ల బంగారం ధర 57,110 వద్దకు చేరింది. కిలో వెండి ధర హైదరాబాద్ మార్కెట్‌లో 98,000 గా ఉంది.

# కల్తీనెయ్యిపై పెరుగుతున్న ఆందోళన



అమరావతి,తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారంతో ఇప్పుడు సీబీఐతో విచారణ జరిపించాలన్న డిమాండ్ పెరుగుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న భక్తుల మనోభావాలను గౌరవించి రాష్ట్ర ప్రభుత్వం కూడా సీబీఐ విచారణకు వెంటనే అనుమతిచ్చి చిత్తశుద్ధిని చాటుకోవాలి. మాజీ సిఎం జగన్, ఆయన పరివారం ఈ వ్యవహారాన్ని రాజకీయ కోణంగా చూస్తూ చంద్రబాబుపై బురదజల్లడం ద్వారా, తమ తప్పులను కప్పి పుచ్చుకోవాలని చూస్తున్నారు. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదు. జగన్ ప్రధానికి రాసిన లేఖ ద్వారా ఆయన కుయత్నాలు అర్థం చేసుకోవచ్చు. ఆయన సొంత చెల్లెలు, పిసిసి చీఫ్ షర్మిల కూడా భక్తుల మనోభావాలు దెబ్బతిన్నందున సిబిఐ విచారణ జరపాలని కోరుకుంటున్నారు. ఈ మేరకు గవర్నర్‌ను కలిసి వినతిపత్రం కూడా సమర్పించారు. గత ఐదేళ్లలో తిరుమలలో పరిస్థితి వికటించింద నడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. స్వామివారి సేవను విస్మరించి అప్పటి ముఖ్యమంత్రి సేవలో కింది నుంచి పై వరకూ తరించిపోయారు. తిరుమలకు ఉన్న విశిష్టతను మంటగలిపారు. టీటీడీలో పనిచేస్తున్న సిబ్బందిలో భయం, భక్తి సన్నగిల్లింది. అవినీతి స్వైర విహారం చేసింది. దేవుడి సన్నిధిలో అవినీతికి పాల్పడటం మహాపాతకం అన్న పాపభీతి కూడా లేకుండా పోయింది. తిరుమల కొండను సర్వ పాపాలకూ వేదికగా మార్చేశారు. దేవదేవుడిని భక్తి, నమ్మకంతో కాకుండా స్వార్థం కోసం వాడుకున్నారు. ఇంత కాలానికి పాపం పండింది. వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్టుగా కల్తీ నెయ్యితో అసలు విషయం బయటపడింది. ఆవు నెయ్యి కల్తీ జరిగిన విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడిస్తే..దానివల్ల జరిగిన నష్టాన్ని గుర్తించి, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూడాల్సిన జగన్,ఆయన భజయ బృందం ఎదురుదాడి విమర్శలు చేయడం వారి కుహనా రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి. రోజాలాంటి వారు కూడా విమర్శలు చేస్తున్నారే తప్ప, దేవదేవుడికి అపచారం జరిగితే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం లేదు. వ్యవహారం బయటపడగానే దేశ విదేశాలకు చెందిన భక్తులు మండిపడ్డారు. ఆవు నెయ్యిలో పంది కొవ్వు నుంచి తీసిన నూనె కలిపారని నిర్ధారణ కావడంతో కేంద్ర ప్రభుత్వం కూడా ఉలిక్కిపడింది. ఇంతకాలంగా తాము జంతువుల కొవ్వుతో చేసిన నెయ్యితో తయారుచేయించిన లడ్డూలను తిన్నామా! అని భక్తులు తీవ్ర మానసిక ఆవేదన చెందారు. ఈ మహాపాతకానికి పాల్పడిన వారిని కఠినాతికఠినంగా శిక్షించాల్సిందే అన్న డిమాండ్ ప్రపంచవ్యాప్తంగా వస్తోంది. అందువల్ల సిబిఐ విచారణ జరగాల్సిందే. మార్కెట్ ధరలో సగం ధరకే నెయ్యి సరఫరా చేయడానికి ముందుకు వచ్చిన సంస్థలను ఆహ్వానించి.. వారికే టెండర్లను కట్టబెట్టిన వారందరినీ శిక్షించాలి. తిరుమల లడ్డూ విశిష్టతను, పవిత్రతను కాపాడలేక పోయిన ప్రతి ఒక్కరినీ ఇందులో దోషులుగా చేర్చాలి. ఈ వ్యవహారం వెనుక ఎవరున్నారు? వారికి కలిగిన ప్రయోజనం ఏమిటో కూడా నిగ్గు తేల్చాలి. కల్తీ నెయ్యి సరఫరా చేసిన కంపెనీని బ్లాక్ లిస్ట్ చేస్తున్నామని ప్రస్తుత ఈవో శ్యామలరావు చెప్పారు. బ్లాక్ లిస్ట్ చేయడం కాదు.. భక్తుల మనోభావాలతో ఆడుకున్న ఆ కంపెనీ యజమానిని కఠినంగా శిక్షించాల్సిందే. కల్తీ నెయ్యి వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన వివరణ, చేస్తున్న వాదన అంతా వ్యవహారాన్ని పక్కదారి పట్టించేదిగా ఉంది. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీస్తుండటంతో కల్తీ నెయ్యి వ్యవహారాన్ని తెరమీదకు తెచ్చారని ఆయన వాదించడం ద్వారా హిందువుల మనోభావాలను మరింత దెబ్బతీస్తున్నారు. శ్రీవారికి భక్తులు ఎప్పటి నుంచో సమర్పించిన కానుకల్లోని విలువైన వాటిని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తస్కరించుకుపోయారని, వాటిని కరకట్టపై ఉన్న ఆయన నివాసంలో దాచిపెట్టారని ఎంపీ విజయసాయిరెడ్డి అప్పట్లో తీవ్ర ఆరోపణలు చేసారు. మాజీ ప్రధానార్చకులు రమణదీక్షితులు వంటి వారు వంత పాడారు. ఇప్పుడు తత్వం బోధపడిన అదే రమణదీక్షితులు గత ఐదేళ్లుగా కొండపై జరిగిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావని అంటున్నారు. రమణదీక్షితులు కూడా రాజకీయాల్లో తలదూర్చడం దారుణం కాక మరోటి కాదు. తిరుమల శ్రీవారు తనవద్ద జరుగుతున్న అపచారాలను ఇంతకాలం భరించారు. ఏదో ఒక రూపంలో బయటకు తీసుకుని వచ్చారు. అందువల్ల ప్రభుత్వం కూడా సిబిఐతో విచారణ చేయించి భక్తులకు నమ్మిక కలిగించాలి.

# ఏచూరి లేకపోవడం రాజకీయాల్లో పెద్ద లోటు



న్యూఢిల్లీ,ప్రస్తు రాజకీయ తరుణంలో సీతరాం ఏచూరి లేని లోటు కనిపిస్తుందని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అక్షర సత్యాలు. నిజానికి ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షం ఉండాలి. అదికూడా నిబద్ధత కలిగిన నాయకుడి అధ్యక్షుడిగా ఉంటే మంచిది. జాతీయ రాజకీయాల్లో ఇప్పుడు ఆ లోటు కనిపిస్తోంది. నిగ్గదీసే నిబద్ధ రాజకీయాలు కరువయ్యాయి. ఈ తరుణంలో సీతరాం ఏచూరి మరణం జాతీయ రాజకీయాల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఇది సిపిఎం లేదా లెఫ్ట్ రాజకీయాలకు కూడా వర్తిస్తుంది. దేశ జాతీయ రాజకీయాలు కీలకమైన మలుపులో వున్న ఈ తరుణంలో సీతారాం ఏచూరి అకాల మరణం సిపిఎంకి పెద్ద ఎదురుదెబ్బ. మొత్త వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకికవాద శక్తులకు తీరని నష్టం.దోపిడి రహిత సమాజం కోసం జరిపే పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళేం దుకు ఏచూరి ఎంతగానో కృషి చేశారు. మోడీ ప్రభుత్వం తీసుకుంటున్న నిరణయాల్లో మంచివి,చెడువీ ఉంటున్నాయి. ఇలాంటి సందర్భాల్లో మంచిని మంచిగా, చెడును చెడుగా విశ్లేషించే నాయకుడుగా ఏచూరి లేకపోవడం ప్రజలకు కూడా పెద్ద లోటుగానే భావించాలి. తీవ్రమైన ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో పోరాడుతూ ఇక్కడి ఎయిమ్స్‌లో ఆయన గత గురువారం కన్నుమూశారు. పార్టీ అగ్ర నేతల్లో ఒకరైన ఏచూరి వామపక్ష ఉద్యమ విశిష్ట నేతల్లో అగ్రగణ్యులు. ప్రముఖ మార్క్సిస్ట్ సిద్ధాంతకర్త కూడా. ఆర్థిక శాస్త్రంలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ రెండింట్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన తెలివైన విద్యార్థి. 1974లో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలో విద్యార్థి ఉద్యమంలో ఆయన చేరారు. ఆ తర్వాత ఎస్ఎఫ్ఐ నాయకుడయ్యారు. కేవలం రెండు సంవత్సరాల వ్యవధిలోనే జెఎన్‌యు విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా మూడు పర్యాయాలు ఎన్నికయ్యారు. 1984 నుండి 1986 వరకు ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడిగా పనిచేశారు. విద్యార్థి సంఘాన్ని అఖిల భారతస్థాయిలో ఒక శక్తిగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. 1975లో సీతారాం ఏచూరి సిపిఎంలో చేరారు. ఆయన చేపట్టిన రాజకీయ కార్యకలాపాల కారణంగా ఎమర్జెన్సీ సమయంలో అరెస్టయ్యారు. 1985లో పార్టీ 12వ మహాసభల్లో కేంద్ర కమిటీకి ఎన్నికైన ఆయన చివరి వరకు కొనసాగారు. 1989లో కేంద్ర కార్యదర్శివర్గానికి ఎన్నికయ్యారు. 1992లో పార్టీ 14వ మహాసభల్లో పొలిట్‌బ్యూరోకు ఎన్నికయ్యారు. 2015లో పార్టీ 21వ మహాసభల్లో సిపిఎం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఏచూరి చివరి వరకు అదే పదవిలో కొనసాగారు. మూడు దశాబ్దాలకుపైగా కేంద్ర పార్టీ నాయకత్వ బృందంలో భాగంగా ప్రతీసారీ పలు అంశాలపై పార్టీ రాజకీయ వైఖరులను రూపొందించడంలో ముఖ్య భూమిక పోషించారు. సైద్ధాంతిక విభాగంలో సీతారాం ఏచూరి విశిష్టమైన పాత్ర పోషించారు. సోషలిజానికి ఎదురుదెబ్బలు తగలడంతో పార్టీ సైద్ధాంతిక వైఖరులను రూపొందించిన 14వ మహాసభల్లో నిర్దిష్టమైన సైద్ధాంతిక అంశాలపై పార్టీ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానాన్ని కామ్రేడ్ సీతారాం ఏచూరి రూపొందించి మహాసభ ముందుంచారు. ఆ తర్వాత, 2012లో పార్టీ 20వ మహాసభల్లో సైద్ధాంతిక వైఖరులను సవరించిన తీర్మానాన్ని మొదటగా బలపరిచింది కూడా ఏచూరే. తదనంతరం ఆ తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది. పార్టీ కేంద్ర కమిటీ అంతర్జాతీయ విభాగాధిపతిగా ఏచూరి వివిధ అంతర్జాతీయ కమ్యూనిస్టు, ప్రగతిశీల శక్తుల వేదికలపై పాల్గొన్నారు. సోషలిస్టు దేశాలతో సంబంధాలను బలోపేతం చేశారు. సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలకు సంఘీభావం ప్రకటించారు. ఆయన స్వయంగా మంచి రచయిత కూడా. 2005 నుండి 2017 వరకు రెండుసార్లు ఆయన రాజ్యసభ సభ్యుడిగా వున్నారు. సిపిఎం గ్రూపు నాయకుడిగా వున్న ఆయన సమర్థవంతమైన పార్లమెంటేరియన్‌గా తనను తాను నిరూపించు కున్నారు. ఎన్నో సమస్యలను నిర్మొహమాటంగా లేవనెత్తేవారు. ఛలోక్తులతో ప్రభుత్వాన్ని విమర్శించేవారు. విధానపర నిర్ణయాల్లో ఆయన రాజీలేని వైఖరితో మోడీ ప్రభుత్వాన్ని ఎండగట్టారు. 2017లో ఆయనకు ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు లభించింది. ఇటీవలి కాలంలో సీతారాం ఏచూరి, లౌకిక ప్రతిపక్ష పార్టీల మధ్య విస్తృత ఐక్యత కోసం తన సమయాన్ని, శక్తిని ప్రధానంగా వెచ్చించారు. అంతిమంగా అది ఇండియా బ్లాక్‌గా రూపుదిద్దుకుంది. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ హయాంలో, తర్వాత వచ్చిన యుపిఎ ప్రభుత్వ కాలంలో ఈ సంకీర్ణాలకు మద్దతిచ్చిన సిపిఎం పార్టీకి కీలకమైన అనుసంధాన కర్తల్లో ఒకరిగా ఏచూరి వున్నారు. ఏచూరికి వున్న స్నేహపూర్వక స్వభావం వల్ల అన్ని రాజకీయ పార్టీల్లో, అన్ని రంగాలకు చెందిన వారిలో ఆయనకు విస్తృత సంఖ్యలో మిత్రులు వున్నారు. ఏచూరికి వున్న రాజకీయ సమగ్రత, అంకిత భావం చూసి వారందరూ ఎంతగానో గౌరవించేవారు. అందుకే ప్రస్తుత రాజకీయాల్లో ఏచూరి లోటును పూడ్చడం సాధ్యం కాకపోవచ్చు.

# తెలంగాణలో మరో 'గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ' పోరు..

హైదరాబాద్,నాలుగు ఉమ్మడి జిల్లాలు.. 40కి పైగా అసెంబ్లీ నియోజ వర్గాలు.. ఒకే ఒక్క ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థుల సంఖ్య మాత్రం పెద్దగానే ఉండే అవకాశం ఉంది. పార్టీలు, ఆశావాహులు, తటస్థులు అందరూ..గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికకు రెడీ అవుతున్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ గ్రాడ్యుయేట్ ఎన్నిక నోటిఫికేషన్‌కు ఇంకా కొన్ని నెలల సమయం ఉన్నప్పటికీ..ఇప్పటి నుంచే ప్రచార జోరును పెంచారు కొందరు ఆశావాహులు.తమ అభ్యర్థిత్వాన్ని బలపరచాలంటూ విద్యావంతుల మద్దతు కోరుతున్నారు. ఓ వైపు పట్టభద్రులతో సమావేశాలు నిర్వహిస్తూ నే..మరోవైపు పార్టీ టిక్కెట్ల కోసం ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఈ సారి తటస్థులు కూడా పోటీకి సిద్ధం అవుతుండటం ఆసక్తి రేపుతోంది. రాజకీయ పార్టీలతో సంబంధం లేని వారు రంగంలోకి దిగుతుండటం ..పొలిటికల్ పార్టీలు వర్సెస్ తటస్థులు మధ్య పోటీ నెలకొననుంది. ఇంతకాలం రాజకీయాలతో అంటీ ముట్టనట్టుగా వ్యవహరించిన వారు కూడా పోటీ పడేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

సత్తా చాచేందుకు వ్యూహాలు

ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌తో పాటుగా ఇతర పార్టీలు బలమైన అభ్యర్థులను బరిలోకి దింపేందుకు సిద్ధమవుతున్నాయి. అధికార పార్టీ కాంగ్రెస్ తిరిగి సిట్టింగ్ స్థానాన్ని కైవసం చేసుకోవాలని చూస్తుండగా.. బీజేపీ కాషాయం జెండా ఎగుర వేయాలని ప్లాన్ చేస్తుంది. ఇక గతంలో బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న ఈ మండలి సెగ్మెంట్లో తిరిగి సత్తా చాచేందుకు కారు పార్టీ వ్యూహాలు రచిస్తుంది. ఇదే సమయంలో తటస్థులు తమ గెలుపుతో రికార్డులు బద్దలు కొట్టాలనుకుంటున్నారు.బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన ఎన్నికల్లో స్వామిగౌడ్ విజయం సాధించగా.. 2019 మార్చిలో జరిగిన ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన జీవన్ రెడ్డి గెలుపొందారు. అయితే ఈసారి విజయం ఎవరిని వరిస్తుందనేది ఆసక్తిగా మారింది.

కాంగ్రెస్ పార్టీ టికెట్‌కు పోటీ ఎక్కువగా కనిపిస్తుంది. కాంగ్రెస్ తరఫున వెలిచాల రాజేందర్ రావు, మేనేని రోహిత్ రావు, ప్రణవ్ బాబు, ఆర్.సత్యనారాయణ, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి, ప్రొఫెసర్



ప్రసన్న హరికృష్ణ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అయితే నరేందర్ రెడ్డి పార్టీ టికెట్ వచ్చిన రాకున్నా పోటీ చేస్తానంటున్నారు. మిగితా వారంతా ఎవరికి వారు టిక్కెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న జీవన్ రెడ్డి.. మరోసారి మండలికి పోటీ చేస్తారా లేదా అనేది ఆసక్తిగా మారింది.

టికెట్ కోసం వీరి ప్రయత్నాలు

బీఆర్ఎస్ నుంచి ట్రస్మా ఛీఫ్ అడ్వయిజర్ యాదగిరి శేఖర్ రావు టికెట్ వస్తుందన్న ధీమాతో గ్రౌండ్ వర్క్ మొదలు పెట్టారు. ఆ పార్టీకి చెందిన మాజీ మేయర్ రవీందర్ సింగ్ కూడా పోటీలో నిలుస్తున్నట్లు ప్రకటించారు. బీజేపీ నుంచి గతంలో పోటీ చేసిన సుగుణాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, రాణి రుద్రమ, జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్మన్ భోగ శ్రావణి, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ టికెట్ కోసం ప్రయత్నిసున్నట్లు ప్రచారం జరుగుతుంది.ఆశావాహులంతా ఇప్పటికే అధిష్టానాలను కలిసి తమకు అవకాశం ఇవ్వాలంటూ కోరుతున్నారు. %×పీూ% రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేసిన డాక్టర్ బీఎన్ రావు పోటీకి రెడీ అయ్యారు. విద్యాసంస్థల నిర్వాహకుడు, జాబ్ మేళాలతో యవతకు ఉపాధి కల్పిస్తున్నా ముస్తాక్ అలీ పోటీకి సైఅంటున్నారు. కరీంనగర్ జిల్లాకు సంబంధించిన వారే కాకుండా ఇతర జిల్లాల్లో చాలామంది మండలి ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఏ పార్టీ నుంచి అయినా ఒక్కరికే టికెట్ వస్తుంది కాబట్టి టికెట్ రాని వారు పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటారా అనేది వేచి చూడాలి.

# ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో ఎత్తుకు పైఎత్తులు..



హైదరాబాద్,తెలంగాణ ఫిరాయింపు ఎమ్మెల్యేల ఎపిసోడ్ రోజుకో టర్న్ తీసుకుంటోంది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని పబ్లిక్ అకౌంట్ కమిటీ చైర్మన్‌గా అసెంబ్లీ స్పీకర్ నియమించడంతో వివాదం పీక్ లెవల్‌కు చేరుకుంది. ప్రతిపక్షానికి ఇవ్వాల్సిన %ూాజ% పదవిని పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేకు ఎలా ఇస్తారని అపోజిషన్ మండిపడుతోంది.అయితే అధికార పార్టీ మాత్రం అరికెపూడి గాంధీ కాంగ్రెస్‌లో చేరలేదని చెప్తోంది. ఆయన బీఆర్ఎస్‌లోనే ఉన్నారు..స్పీకర్ ప్రకటించిన జాబితాలో కూడా బీఆర్ఎస్ అని ఉందంటూ సమర్థించుకుంది. దీని విషయంలో కూడా రెండు పార్టీల మధ్య మాటల యుద్ధంతో పాటు ప్రత్యక్ష దాడుల దాకా వెళ్లింది. ఇదంతా అటుంచితే.. ఇప్పుడు కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశానికి అరికెపూడి గాంధీతో పాటు పార్టీ ఫిరాయించిన ఆరుగురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. దీంతో బీఆర్ఎస్ మరోసారి ఫైర్ అవుతోంది.హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హెూటల్‌లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్షం సమావేశం జరిగింది. ఈ మీటింగ్‌కు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేల్లో ఆరుగురు హాజరయ్యారు. పీఏసీ ఛైర్మన్ అరికెపూడి గాంధీతో పాటు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, డాక్టర్ సంజయ్‌కుమార్, ప్రకాష్ గౌడ్‌లు అటెండ్ అయ్యారు. ఈ ఇష్యూపై బీఆర్ఎస్ మరోసారి గళమెత్తుతోంది. కాంగ్రెస్‌లో చేరలేదని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చేసిన కామెంట్స్ అబద్ధాలు అంటూ ఎక్స్ వేదికగా మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు.

మర్యాదపూర్వకంగా కలిశారా?

అయితే దీనికి మంత్రి శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ.. హరీష్ రావుకు కౌంటర్ ఇచ్చారు. సీఎం తన నియోజకవర్గానికి వచ్చినందుకే..అరికెపూడి గాంధీ వచ్చి కలిశారే తప్పు.. సీఎల్పీ సమావేశానికి హాజరు కాలేదన్నారు. మిగతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. కాంగ్రెస్ సమావేశానికి రాలేదని.. కేవలం సీఎంను మర్యాద పూర్వకంగా కలిసి వెళ్లారని చెప్పుకొచ్చారు. సిద్దిపేట నియోజకవర్గానికి సీఎం వెళ్తే.. కార్యక్రమంలో హరీష్‌రావు పాల్గొనరా అంటూ శ్రీధర్‌బాబు ఎదురు ప్రశ్నించారు.అధికార కాంగ్రెస్ పార్టీలో కూడా ఫిరాయింపుల అంశం కుతకుతలాడుతోంది. గాంధీభవన్ వేదికగా జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ సమీక్షా సమావేశాల్లో వివాదం రాజుకుంటోంది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు.. గాంధీభవన్‌లో జరిగిన సమీక్షా సమావేశాలకు హాజరయ్యారు. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశాలకు ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశానికి కడియం శ్రీహరి, కరీంనగర్ జిల్లా సమావేశానికి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, నిజామాబాద్ జిల్లా సమావేశానికి పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. అయితే కరీంనగర్ జిల్లా సమావేశం కాస్త రసాభాసా జరిగింది.

సీఎల్పీ సమావేశం వేళ కీలక పరిణామాలు

ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పేర్ల జాబితాలో పార్టీ సీనియర్ నేత ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేరు పొందుపరచలేదు. అదే సమయంలో పార్టీ ఫిరాయించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేరును ప్రస్తావించారు. దీంతో జీవన్ రెడ్డి పార్టీ పెద్దల తీరుపై గరం అయ్యారు. జరిగిన తప్పును గ్రహించిన పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్, ఇంచార్జ్ దీపాదాస్ మున్షి జోక్యం చేసుకొని సర్దిచెప్పారు. ఏదో పొరపాటు వల్ల పేరు పడలేదని..జరిగిన దానికి సారీ చెప్పి.. మరోసారి ఇలాంటి తప్పిదం జరగదని సర్దిచెప్పారు. శనివారం గాంధీభవన్ జరిగిన పరిణామాల నేపథ్యంలో.. ఆదివారం జరిగిన సీఎల్పీ సమావేశానికి జీవన్ రెడ్డి దుమ్మా కొట్టారు.ఇలా పార్టీ ఫిరాయింపుల అంశం హస్తం పార్టీలో ఎన్నో సమస్యలకు దారి తీస్తుంది. బీఆర్ఎస్ మాత్రం పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత కోసం గట్టి ఆధారాలు సేకరించే పనిలో బిజీగా ఉంది. గాంధీభవన్‌లో జరిగే సమావేశాలకు..సీఎల్పీ భేటీకి ఫిరాయింపు ఎమ్మెల్యేలు హాజరైన ఎవిడెన్స్‌ను సేకరించి కోర్టుల దృష్టికి తీసుకెళ్లాలని చూస్తోంది. మరోవైపు ఈ వ్యవహారం నుంచి తప్పించుకునేందుకు టెక్నికల్ అంశాలపై కాంగ్రెస్ ఫోకస్ చేసింది. డైలీ ఎపిసోడ్‌లా కొనసాగుతున్న ఈ ఇష్యూ ఇప్పట్లో కొలిక్కి వచ్చే అవకాశం అయితే కనిపించడం లేదు. అయితే ఫైనల్‌గా ఎవరు పైచేయి సాధిస్తారనేది మాత్రం హాట్ టాపిక్‌గా మారింది.

# పెద్దిరెడ్డి, ఆర్కే రోజా దర్శనం టిక్కెట్ల స్కామ్!



అమరావతి,జగన్ పరిపాలన జరిగిన ఐదేళ్ళ కాలంలో శ్రీవారి దర్శనం టికెట్లు గోల్ మాల్ చేసి మాజీమంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా కోట్ల రూపాయలు దండుకొన్నారని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఆరోపించారు. ఐదేళ్ల పాలనలో వైసీపీ వాళ్లు శ్రీవారి సొమ్మును దోచుకున్నారని ఆయన విమర్శించారు. దైవసేవ సేవచేయాల్సిన మాజీ ఈవో ధర్మారెడ్డి జగన్ పార్టీ నాయకుల సేవలో తరించారని వర్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. "పర్యాటకశాఖకు ప్రతిరోజూ 1000 దర్శనం టికెట్లు ఇస్తారు. వాటిలో 800 టికెట్లు మాజీమంత్రి పెద్దిరెడ్డి ఆశీస్సులతో నిర్వహించే 'కళాధర్ ట్రావెల్స్'కి ఇచ్చేవారు. హైదరాబాద్, బెంగళూరు, కడప, కర్నూలు, గంగావతి ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఈ టికెట్లు అమ్మేవారు. ఒక్క కళాధర్ ట్రావెల్స్.కి మాత్రమే అన్ని టికెట్లు ఇవ్వడంలో రహస్యం, అంతర్యం ఏమిటి?" అని వర్ల రామయ్య ప్రశ్నిస్తున్నారు. ఈ 800 టికెట్లను రద్దీని బట్టి ఐదు వేల రూపాయల నుంచి పదివేల రూపాయల వరకూ అమ్మేవారని వర్ల ఆరోపించారు. ఒక్క కళాధర్ ట్రావెల్స్ వారికే అన్ని టికెట్లు ఇవ్వడం ఏమిటి? అని వర్ల ప్రశ్నిస్తున్నారు.మరోవైపు పర్యాటక శాఖ మంత్రి రోజా విషయానికి వస్తే.. నిజానికి ఆమె మంత్రి అయిన తర్వాత శ్రీవారి దర్శనాల్లో అందినంత డబ్బు దండుకోవడం మాత్రమే కాదు. ఎమ్మెల్యేగా వున్నప్పుడు కూడా నెలనెలా లక్షలాది రూపాయలు అక్రమ మార్గాల్లో దండుకునే వారనే ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్యేలకు నెలకు ఒకసారి ప్రోటోకాల్ దర్శనం ఉంటుంది. ఎమ్మెల్యేలు ఇచ్చే సిఫారసు లేఖలకు అదనంగా, ఆ ఒక్క సందర్భంలో ఎమ్మెల్యే వెంట వచ్చే భక్తులను భారీ సంఖ్యలో అనుమతించేవారు. ప్రోటోకాల్ దర్శనం టిక్కెట్ ధర బ్లాక్ మార్కెట్‌లో ఒక్కొక్కటి 20 వేల వరకు కూడా పలుకుతూ వుంటుంది. ఈ టికెట్లను తాను ఏర్పాటు చేసుకున్న దళారీ ఉద్యోగుల ద్వారా రోజా విక్రయించి దండుకునేవారని ఆరోపణలున్నాయి. అలాగే బుక్ మై దర్శన్ పోర్టల్ ద్వారా కూడా టిక్కెట్ల బుక్కింగ్ విషయంలో అక్రమాలకు పాల్పడ్డారని వర్ల రామయ్య ఆరోపిస్తున్నారు.

# తిరుపతి లడ్డూ వివాదం.. ఆ ఆలయంలో ప్రసాదాలపై నిషేధం

లక్నో: తిరుపతి శ్రీవారి లడ్డూ చుట్టూ ప్రస్తుత వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో యూపీలోని మంకామేశ్వర్ ఆలయం కీలక నిర్ణయం తీసుకున్నది. భక్తులు బయటి నుంచి తీసుకువచ్చే ప్రసాదాలపై నిషేధం విధిస్తూ ఆ ఆలయం నిర్ణయం తీసుకున్నది. కేవలం ఇంట్లో తయారు చేసిన ప్రసాదాలను కానీ, పండ్లను మాత్రమే ఆలయంలో నైవేద్యంగా సమర్పించాలని మంకామేశ్వర్ ఆలయ మహంతి దేవ్య గిరి తెలిపారు. తిరుపతిలో కలుషిత ప్రసాదాన్ని సరఫరా చేయడం క్షమించరాని నేరమని మహంతి పేర్కొన్నారు.తిరుపతి ప్రసాదంలో జంతువుల నెయ్యి కలిసిన నేపథ్యంలో.. భక్తులు తాము తీసుకువచ్చే ప్రసాదాలను మాంసాహార పదార్థాలతో తయారీ చేయరాదు అని ఆమె తెలిపారు. ఇంట్లో తయారు చేసిన నెయ్యి లేదా డ్రై ఫ్రూట్స్ లేదా పండ్లను తీసుకురావాలని గిరి వెల్లడించారు. దేవునికి సమర్పించే ప్రసాదాల్లో జంతు పదార్థాలను వాడడం సనాతన ధర్మంపై



దాడి చేయడమే అని, తిరుమలలో ఆ నేరానికి పాల్పడిన వ్యక్తలకు మరణశిక్ష విధించాలని మహంతి గిరి అభిప్రాయపడ్డారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com